ప్రజాశక్తి

శుక్రవారం జనవరి 2 2026 పేజీలు 12



విజయనగరం

పార్వతీపురం మన్యం

మన్యం జిల్లాలో మార్పు లేనట్టే

- పాలకొండను కనికరించని పాలకులు
- సాలూరులోనే మెంటాడ మండలం
- నిరాశలో జెఎసి నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనలో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి మార్పులు చేయడానికి ప్రభుత్వం ఆసక్తి చూపలేదు. ప్రధానంగా ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వేరుపడి కొత్త జిల్లాగా ఆవిర్భవించిన పార్వతీపురం మన్యం జిల్లా జోలికి వెళ్లలేదు. జిల్లా పేరు నుంచి మన్యం అనే పదాన్ని తొలగించాలని కూడా ఒత్తిడి ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయలేదు. ఈ జిల్లా రూపురేఖల మార్పులు, చేర్పుల జోలికి ప్రభుత్వం వెళ్లకపోవడానికి కారణం డిమాండ్ చేస్తున్న వారి నుంచి పెద్దగా ఒత్తిడి లేకపోవడమేనని తెలుస్తోంది. పాలకొండ నియోజకవర్గాన్ని శ్రీకాకుళం జిల్లాలో కలపాలని నియోజకవర్గ నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా సాధన కమిటీ పేరుతో ప్రజాసంఘాల నాయకులు జెఎసిగా ఏర్పడి రిలే దీక్షలు చేపట్టారు. అమరావతి వెళ్లి పునర్విభజనపై నియమించిన మంత్రుల సబ్‌కమిటీని కలిసి వినతిపత్రాలు అందజేశారు. పాలకొండ నియోజకవర్గ ప్రజలకు ఎక్కువగా శ్రీకాకుళం జిల్లాతో సత్సంబంధాలు నెలకొన్నాయి. భామిని మండలం ఇప్పుడున్న మన్యం జిల్లాకు చాలా దూరంగా ఉంటుందని వాదిస్తూ జెఎసి నాయకులు పోరాటం చేశారు. అయితే ప్రభుత్వాన్ని, స్థానిక అధికారపార్టీ నాయకులను కదిలించే స్థాయిలో జెఎసి నాయకులు పోరాటం నిర్మించలేదు. వారి డిమాండ్‌ను జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తిరస్కరించారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు కూడా జెఎసి నాయకులు డిమాండ్‌తో పూర్తిగా ఏకీభవించలేదు. అయితే గత ఎన్నికల ముందు ప్రచారానికి పాలకొండ వచ్చిన సిఎం చంద్రబాబు నాయుడు భామిని మండలాన్ని శ్రీకాకుళం జిల్లాలో విలీనంపై హామీ ఇచ్చారు. ఆ హామీని నిలబెట్టు కోవాలని జెఎసి నాయకులు కోరినా ఫలితం లేకపోయింది. మన్యం జిల్లా నుంచి వేరుచేసి శ్రీకాకుళం జిల్లాలో కలపాలని, లేదా పాలకొండను జిల్లా చేయాలన్న డిమాండ్‌కు ప్రధాన రాజకీయ పార్టీల నుంచి మద్దతు కరువైన కారణంగానే ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదనే చర్చ జరుగుతోంది.



మెంటాడ ఆశలపై నీళ్లు

మన్యం జిల్లాలో సాలూరు నియోజకవర్గంలో ఉన్న మెంటాడ మండలం పరిస్థితి కుడితిలో పడిన ఎలుకలా తయారైంది. గత ప్రభుత్వ హయాంలో మెంటాడ మండలాన్ని విజయనగరం జిల్లాలో విలీనం చేస్తూ తీసుకున్న నిర్ణయం అటకెక్కిపోయింది. భౌగోళికంగా విజయనగరం జిల్లాకు దగ్గరగా ఉన్న మెంటాడ మండలాన్ని వేరు చేయాలని వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రధాన రాజకీయ పార్టీల నాయకుల జెఎసి డిమాండ్ చేసింది. భౌగోళికంగా సాలూరు నియోజకవర్గంలో ఉన్న మెంటాడ మండలం పార్వతీపురం జిల్లా కేంద్రానికి 120 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీని వల్ల తాము అనేక మిగతా 3లో

నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేస్తున్న రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరంకోట, కంటోన్మెంట్

నూతనసంవత్సర వేడుకలు గురువారం జిల్లా అంతటా ఘనంగా జరిగాయి. ప్రజాప్రతినిధులకు, అధికారులకు, వివిధ పార్టీల నాయకులకు ఉద్యోగులు, సిబ్బంది, కార్యకర్తలు, అభిమానులు నూతన సంవత్స శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర చిన్నసూక్ష్మ మధ్యతరహా పరిశ్రమలు, పేదరిక నిర్మూలన, ఎన్నారై సాధికారతా సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పోటెత్తారు. స్థానిక అయ్యన్నపేట జంక్షన్ సమీపంలోని కల్యాణమండపంలో జరిగిన ఈ వేడుకల్లో మంత్రి శ్రీనివాస్ కేక్ కట్‌చేసి, అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సూచనలు మేరకు అందరూ మంత్రికి పుస్తకాలు, పెన్నులు, పూల మొక్కలతో ఆదర్శంగా శుభాకాంక్షలు మిగతా 3లో

మంత్రి సంధ్యారాణికి పూలబొకేను అందజేస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

7న 'స్వచ్ఛ రథం' ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర గ్రామీణ ప్రాంతాలలో పొడి చెత్త మరియు ప్లాస్టిక్ వ్యర్థాల సమర్థ నిర్వహణ లక్ష్యంగా స్వచ్ఛ రథం పథకాన్ని జనవరి 17న జిల్లా వ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి కమిషనర్ మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. గ్రామాలలో ఉత్పత్తి అయ్యే పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన స్వచ్ఛ రథం, వస్తు మార్పిడి విధానంలో పనిచేస్తూ, ప్రజలు ఇచ్చే పొడి చెత్తకు బదులుగా నిత్యావసర సరుకులు అందిస్తుందని కలెక్టర్ వివరించారు. ఈ పథకం ద్వారా గృహాల్లో చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసే అలవాటు పెంపొందడంతో పాటు గ్రామీణ పారిశుధ్యం, పర్యావరణ నాణ్యత మెరుగుపడుతుందన్నారు. జిల్లాలోని 27 మండలాలకు ఒక్కో స్వచ్ఛ రథం చొప్పున నెలవారీ అద్దె విధానంలో ఆపరేటర్లను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టంలో ఉపయోగించిన వాహనాలకు నెలకు రూ.20వేలు నుంచి రూ.25వేలు వరకు అద్దె చెల్లిస్తామని తెలిపారు. ఈ పథకం ఖర్చులు 15వ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్స్ (శానిటేషన్ కంపోనెంట్) నుండి భరిస్తారని పేర్కొన్నారు. ఈ పథకంలో పాల్గొనదలచిన ఔత్సాహికులు తమ దరఖాస్తులను జిల్లా పంచాయితీ అధికారి, విజయనగరం వారికి ఈనెల 7లోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోరారు. అందిన దరఖాస్తులను జిల్లా స్థాయి కమిటీ పరిశీలించి అర్హులైన ఆపరేటర్లను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

న్యూ ఇయర్ కిక్

- కొత్త సంవత్సరాన తప్పతాగిన మందుబాబులు
- ఒక్కరోజే రూ.6.35 కోట్ల మద్యం విక్రయం
- క్రయ, విక్రయాలకు రాత్రి 12గంటల వరకు అనుమతి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

ఔను...! ఆ ఒక్కరోజే రూ.6.35కోట్ల విలువైన మద్యాన్ని మందుబాబులు తాగేశారు. అదును చూసి పదును పెట్టాలన్నట్టుగా ప్రభుత్వం కూడా మందుబాబులు, సరదా సందళ్లను ఆసరా చేసుకుని విక్రయాలకు సమయాన్ని పొడిగించింది. నూతన సంవత్సరానికి స్వాగతం పలికే పేరుతో డిసెంబర్ 31వ తేదీన జనం అర్థరాత్రి వరకు వేచివుంటారన్న సంగతి తెలిసిందే. ఈ పేరుతో అప్పటి వరకు కాలక్షేపం చేయడం, మద్యం ప్రియులు ఫుల్ జోష్‌తో పూటుగా తాగడం కూడా పరిపాటిగా మారిపోయింది. ఈ ఏడాది ఇటువంటి సంస్కృతి మరింతగా పెరిగిపోయింది. విజయనగరం జిల్లాలో రూ.6.35కోట్ల మద్యాన్ని సేవించడం ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. మద్యం దుకాణాల్లో నిరంతరం అన్ని రకాల బ్రాండ్లు అందుబాటులో ఉంటాయి. కానీ, బుధవారం ఒక్కరోజే నెల్లిమర్లలోని ఎపి బేవరేజెస్ డిపో నుంచి కోట్ల విలువైన మద్యాన్ని దుకాణదారులు తీసుకెళ్లారట. మిగిలిన మద్యం అప్పటికే దుకాణాల్లో ఉన్న స్టాక్ అని అర్థం చేసుకోవచ్చు. మొత్తం సేల్ అయిన మద్యంలో జిల్లాల వారీగా పరిశీలిస్తే విజయనగరం జిల్లాలో అత్యధికంగా రూ.6.35కోట్లు మద్యం అమ్మకాలు జరిగినట్టు ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇందులోనూ విజయనగరం పట్టణంలో ఎక్కువగా మద్యం విక్రయాలు జరిగాయి. ఆ తరువాత స్థానాల్లో పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, పాలకొండ, రాజాం, నెలిమర్ల, గజపతినగరం, ఎస్.కోట తదితర పట్టణ కేంద్రాలు ఉన్నాయి.

దాదాపు అన్ని దుకాణాలూ బుధవారం ఉదయం నుంచే మద్యం ప్రియులతో కిటకిటలాడాయి. రాత్రి 9గంటలకు మూసే యవాల్సిన దుకాణాలను అర్థ రాత్రి ఒంటిగంట వరకు తెరుచుకునేందుకు సాక్షాత్తు ప్రభుత్వమే అవకాశం ఇవ్వడంతో అప్పటి వరకు విక్రయాలు కొనసాగాయి. మద్యం విక్రయాలను ప్రభుత్వం ప్రధాన ఆదాయ వన రుగా మారడంతో క్రయ, విక్రయాలకు బార్లు తెరించిందని పలువురు విమర్శిస్తున్నారు.

వాడవాడలా వేడుకలు

నాయకులకు, అధికారులకు శుభాకాంక్షల వెల్లువ

నెల్లిమర్ల: రవిశేఖర్ దంపతులకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

భోగాపురం: బంగార్రాజుకు శుభాకాంక్షలు చెబుతున్న సిబ్బంది

రాజాం: ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

గంట్యాడ : పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

టిడిపి రాష్ట్ర పరిశీలకులు (విశాఖ నార్త్) సువ్వాడ రవిశేఖర్, జిల్లా టిడిపి మహిళా అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌కు మార్‌కు మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు. విజయనగరంలోని పద్మావతి నగర్‌లోని రవిశేఖర్ ఇంటికి చేరుకున్న కార్యకర్తలు వారికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: బొబ్బిలిలో నూతన సంవత్సర వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కోటలో ఎమ్మెల్యే బేబినాయన, మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావుకు శుభాకాంక్షలు చెప్పేందుకు సర్పంచులు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు, అధికారులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు క్యూ కట్టారు. దీంతో కోట జనంతో కిక్కిరిసింది. నూతన సంవత్సరం సందర్భంగా కోటలో ఏర్పాటు చేసిన రేలారే రేలా పాటలు అలరించాయి. మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ రాంబార్కి శరత్ బాబుకు కౌన్సిలర్లు, కార్యకర్తలు, అధికారులు శుభాకాంక్షలు చెప్పారు. వైసిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడుకు వైసిపి నాయకులు, తూముల భాస్క రరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ తూముల అచ్యుతవల్లికు వారి ఇంటిలో, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటి గోపాలరావుకు ఆయన ఇంటి వద్ద వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు, కార్యకర్తలు శుభాకాంక్షలు చెప్పారు. జనసేన కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామికి జనసైనికులు శుభాకాంక్షలు చెప్పారు.

విజయనగరం: కేక్ కట్ చేస్తున్న కమిషనర్ నల్లనయ్య

గంట్యాడ: మండలంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు స్థానిక మండల పరిషత్తు కార్యాలయం వద్ద గురువారం ఎంపిడిఒ ఆర్‌వి రమణమూర్తి, జెడ్‌పిటిసి వర్రి నరసింహామూర్తి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అందరికీ పండ్లు ఫలహారాలను పంచి ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

వంగర: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపిటిసిలు వివిధ శాఖల ఉద్యోగులు, ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ స్వగృహం మద్దివలసలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వంగర టిడిపి సీనియర్ నాయకులు మాజీ ఎంపిపి, మాజీ జెడ్‌పిటిసి బొత్స వాసుదేవరావు నాయుడు వద్దకు పలువురు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.


బొబ్బిలి: ఎమ్మెల్యే సోదరులకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

కొత్తవలస: మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కొత్తవలస క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఎంతో ఉత్సాహంగా సాగాయి. ఐదు మండలాల నుంచి వైసిపి ముఖ్య నాయకులు కడుబండి శ్రీనివాసరావుకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేశారు.

మెరకముడిదాం: టిడిపి మండల అధ్యక్షులు తాడ్డి సన్యాసి నాయుడు, ఎఎంసి చైర్మన్ తాడ్డి చంద్రశేఖర్, ఎంపిపి ప్రతినిధి తాడ్డి వేణుగోపాలరావు, మాజీ డిసిఎంస్ చైర్మన్ సిరివూరి రమణ రాజును, వైసిపి మండల అధ్యక్షులు కోట్ల విశ్వేశ్వరరావును, మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తవలస: ఎమ్మెల్యేకు నమస్కారం చేస్తున్న టిడిపి నాయకులు

వేపాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు గురువారం ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది 2026వ సంవత్సరంలో ఏ విధమైన ఇబ్బందులూ లేకుండా గ్రామ అభివృద్ధికి కష్టపడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

భోగాపురం: జనసేన పార్టీ కార్యాలయం వద్ద పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్ని ఎమ్మెల్యే లోకం నాగమాధవిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పోలిపల్లి గ్రామంలో జాతరను తలపించేలా అభిమానులు, టిడిపి కార్యకర్తలు భారీగా తరలివచ్చి రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజుకు శుభాకాంక్షలు తెలిపారు. ఉప్పాడపేటలో వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, ఎంపిపి ఉప్పాడ అనుషారెడ్డి, రాష్ట్ర మాజీ హౌసింగ్ బోర్డు డైరెక్టర్ ఎ.రాయవలస సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డిని కలిసి కార్యకర్తలు, అభిమా నులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రాజాం: మండలంలోని శ్యాంపురం టిడిపి క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సరం వేడుకలను ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులతో కలిసి కేక్‌ను కట్ చేశారు. అధికారులు, నియోజకవర్గ ప్రజలు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, వేలాదిగా తరలి వచ్చి ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

గరివిడి: పట్టణంలోని మాజీ మంత్రి బొత్స సత్యనా రాయణ కార్యాలయంలో 2026 నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఆయన కుమార్తె బొత్స అనూషకు పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అభిమానుల కోలాహలం మధ్య డాక్టర్ బొత్స అనూష కేక్ కట్ చేసి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో వైసిపి నాయకులు కెవి సూర్యనారాయణరాజు, సిరువురు రమణరాజు, బొత్స సత్యనారాయణ సోదరి ఊటపల్లి సర్పంచ్ చాణక్య లక్ష్మి, నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కార్యాలయంలో..

విజయనగరం టౌన్ : నగరపాలక సంస్థ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది కమిషనర్ పల్లి నల్లనయ్యకు పుష్పగుచ్ఛాలిచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శాలువలతో సత్కరించారు. అనంతరం కేకను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నూతన సంవత్సరంతో ప్రతి ఒక్కరిలో ఆనందోత్సాహాలు వెల్లివిరియాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. అందరి సమిష్టి కృషితో నగర అభివ ద్ధి మరింతగా సాగాలన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఇ ప్రసాద రావు, డిఇ శ్రీనివాస రావు, నగర పాలక సంస్థ, ఉద్యో గులు పాల్గొన్నారు.

విజయనగరం : కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

వైసిపి ఆధ్వర్యాన..

మాజీ ఉప సభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి నివాసంలో వైసిపి ఆధ్వర్యంలో నూతన సంవత్స రాన్ని పురస్కరించుకొని కోలగట్ల సోదరుడు కృష్ణారావు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ-సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవలసిన ఆవశ్యకత ఉందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘం రెడ్డి బంగారు నాయుడు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, నగర కార్పొరేటర్లు, వైసిపి కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఐక్యవేదిక నాయకుల ఆధ్వర్యాన...

ఎస్‌సి,ఎస్‌టి, బిసి, మైనార్టీ శాఖల ఆధ్వర్యాన మహారాజ కోట వెనక భాగంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐక్యవేదిక నాయకులు చోడి ఆదినారాయణ, న్యాయమూర్తి కరీం మాట్లాడుతూ గత 2025 సంవత్సరంలో ప్రజలు అనేక విపత్తులు ఎదుర్కొన్నారని అన్నారు. సమాజం కోసం పనిచేసిన అనేకమంది మేధావులు, ఉద్యమకారులు, ప్రాణాలు కోల్పోయారని ఆవేదన చెందారు. ఈ సంవత్సరం అయినా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఎటువంటి నష్టాలు, కష్టాలు లేకుండా, సమాజం సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రొంగలి రామారావు, ఇప్పిలి రామారావు, బూర ఐశ్వర్య, గంద్రేటి శ్రీను, పి షణ్ముఖరావు, పి.మీనాక్షి, ఎస్ ఆదిలక్ష్మి, సిడగం శ్రీనివాసరావు, కొల్లేటి శ్రీను, నక్క సూర్యనారాయణ, ఎస్ తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో...

బాలాజి నగర్‌లోని జనసేన నాయకులు అవనాపు విక్రమ్ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. జనసేన నాయకులు అవనాపు విక్రమ్ , డాక్టర్ అవనాపు భావన దంపతులు కేక్ కట్ చేసి, అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలంతా సుఖః శాంతులతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

సత్య కళాశాలలో నూతన సంవత్సర వేడుకలు

సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో నూతన సంవత్సర వేడుకలను కళాశాల ప్రాంగణంలో ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల సంచాలకులు డాక్టర్. ఎం. శశి భూషణ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, అధ్యాపకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా శశిభూషణరావు మాట్లాడుతూ నూతన సంవత్సరం ప్రతి విద్యార్థి జీవితంలో కొత్త లక్ష్యాలు, కొత్త ఆశయాలను నింపాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, కఠిన శ్రమతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ సాయి దేవమణి మాట్లాడుతూ నూతన సంవత్సరం విద్యార్థులకు విద్యా, వ్యక్తిత్వ వికాసంలో మైలురాయిగా నిలవాలని అన్నారు. చదువుతో పాటు సామాజిక బాధ్యతను అలవర్చుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని అన్నారు.


భోగాపురం : ఎమ్మెల్యే నాగమాధవితో జనసేన నాయకులు

గరివిడి: కేక్ కట్ చేస్తున్న బొత్స అనూష, తదితరులు

మాజీ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు చెబుతున్న వైసిపి నాయకులు

వేపాడ: ఎంపిడిఒకు శుభాకాంక్షలు చెబుతున్న సిబ్బంది

సత్య కళాశాల కరస్పాండెంట్‌కు శుభాకాంక్షలు చెబుతున్న సిబ్బంది

తహశీల్దార్ బదిలీకి ముమ్మర యత్నాలు

స్వార్థ ప్రయోజనాల కోసం ఏకమైన అధికార, ప్రతిపక్ష నేతలు

ప్రజాశక్తి - కొమరాడ

కొమరాడ మండలం పేరు వింటేనే చాలు చిరు ఉద్యోగుల నుంచి మండల స్థాయి అధికారి వరకు విధులు నిర్వహించడానికి భయపడారు. ఆ మండలంలో మేము ఉద్యోగాలు చేయలేమని చెప్పే పరిస్థితి ఉంది. ఇలా కొంతమంది భయపడి మండలానికి బదిలీపై రాకపోతే, మెప్పుకోసం కొంతమంది వచ్చిన వారు వారికి దొరికినది దోచుకొని ప్రజలు పనులు చేయకుండా నానా ఇబ్బందులకు గురి చేసి ఆఖరుకు సస్పెండ్లు, బదిలీలపై వెళ్లేవారు ఇంకొంతమంది ఉన్నారు. ఇలా ప్రజల పనులు చేసే అధికారులే కరువవ్వడంతో ముఖ్యంగా రెవెన్యూ శాఖలో ప్రజల పనులు చేసే అధికారి లేకపోవడం గత కొన్నేళ్లుగా మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏడాది క్రితం మండలానికి వచ్చిన తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ విధులు సక్రమంగా నిర్వహిస్తూ ప్రజల పనులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పరిష్కరిస్తున్నారు. ఈ సమయంలో స్థానిక అధికార, ప్రతిపక్ష నాయకులకు వివిధ అవసరాలు, స్వప్రయోజనాలకు సంబంధించిన పనులు చేయకపోవడంతో ఆయన్ను ఏకంగా బదిలీ చేసేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుత తహశీల్దార్‌ను బదిలీ చేసి పాలకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో గల ఓ మహిళా తహశీల్దారును ఇక్కడకు బదిలీపై తీసుకొచ్చేందుకు నాయకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇటీవల మండలంలో అధికార, ప్రతిపక్ష నాయకులు వివిధ అవసరాల కోసం కొన్ని పనులు చేయమని తహశీల్దార్‌పై తీవ్ర ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేసేందుకు తహశీల్దార్ అంగీకరించకపోవడంతో ఏకంగా కలెక్టర్ స్థాయిలో చెప్పి బదిలీ చేసేందుకు అధికార, ప్రతిపక్ష నాయకులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో నాయకులు

తహశీల్దార్ కార్యాలయం

ప్రజలకు మంచి చేసే అధికారిని ఉంచి పనులు చేయించుకోవాలి తప్ప నిబంధనలకు విరుద్ధంగా వారు చేపట్టే పనులు కావడంలేదని అధికారులను ఇలా బదిలీ చేయడం సరికాదని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా ప్రజల అవసరాలకు ముఖ్యంగా రెవెన్యూ శాఖలో భూ సమస్యలు మండలంలో ఎక్కువగా ఉన్నాయి. ఈ సమస్యలు పరిష్కరించాలంటే సమర్ధత గల అధికారి ఉండాలని మండల రైతులు కోరుతున్నారు. మరోవైపు గతంలో చేపట్టిన రీసర్వేలో అధికారులు నిర్లక్ష్యం వల్ల అనేక తప్పిదాలు జరిగి భూతగాదాలకు దారితీస్తున్న పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం మండలంలో అనేక గ్రామాల్లో రీసర్వే జరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికిప్పుడు తహశీల్దార్‌ను బదిలీ చేస్తే రీసర్వేలో మరిన్ని తప్పిదాలు జరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అధికారుల బదిలీలకు అడ్డుకవేసి, మండలం రెవెన్యూ సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు, మండల ప్రజలు కోరుతున్నారు.

బాధిత రైతులతో కలిసి మాట్లాడుతున్న టిడిపి మండల కన్వీనర్ వేణుగోపాలనాయుడు

ధాన్యం డబ్బులు అందక అవస్థలు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ పెదపెంకి వేణుగోపాలనాయుడు ఆరోపించారు. గురువారం స్థానిక ప్రాథమిక సహకార సంఘం బ్యాంకుకు రైతులను తీసుకెళ్లి వారికి అందాల్సిన బీజీలు చేయకుండా సంబంధిత ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రధానంగా కో-ఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది మధ్య సమన్వయం లేకపోవడంతో రైతులకు శాపంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే రైతులకు ధాన్యం డబ్బులు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు ధాన్యం డబ్బులు చెల్లించకపోతే రుణాలు తీసుకున్న వారిని వడ్డీలు చెల్లించే పరిస్థితి లేదని, సంక్రాంతి పండగ చేసుకొనే అవకాశం కూడా ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు స్పందించి వెంటనే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ చేయాలని కోరారు. ఆయన వెంటనే పలువురు రైతులు ఉన్నారు.

జిల్లా జడ్జికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబితకు శుభాకాంక్షలు తెలిపారు.

సాలూరు : రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తన స్వగృహానికి వెళ్లి కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి, జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన అధికారులు

జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి కి పలువురు అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుభాకాంక్షలు తెలిపారు. పైడితల్లి అమ్మవారి ఆయల పూజారులు ముందుగా కలెక్టర్‌కు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం డిఆర్ఒ ఇ.మురళి, ఇతర శాఖల అధికారులు పుస్తకాలు, పెన్నులను అందజేసి విభిన్నంగా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

మన్యం జిల్లాలో మార్పు లేనట్టే

(మొదటిపేజీ తరువాయి)

ఇబ్బందులు ఎదుర్కొంటామని భావించిన మండల, ప్రజాసంఘాల నాయకులు పోరాడి సాధించుకున్న ఉత్తర్వులు బుట్టదాఖలయ్యే పరిస్థితి కనిపిస్తోంది. సాలూరు నియోజకవర్గంలో మెంటాడ మండలం వున్నా మండల ప్రజల అవసరాల రీత్యా విజయనగరం జిల్లాలో కలపాలన్న డిమాండ్‌కు గత ప్రభుత్వం అంగీకరించింది. అప్పటి ఉమ్మడి జిల్లా అగ్రనేతలు మండల ప్రజల అభీష్టానికి అనుగుణంగా నిర్ణయం తీసుకున్నారు. కానీ టిడిపి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఈ మండల ప్రజల పరిస్థితి అయోమయంగా తయారైంది. గత ప్రభుత్వ హయాంలో వైసిపి నాయకుల నాయకత్వంలో అఖిల పక్ష జెఎసిగా ఏర్పడి విజయనగరం జిల్లా లో విలీనంపై విజయం సాధించారు. అయితే ఆ ఆనందం ఎక్కువ కాలం మిగల్లేదు. టిడిపి ప్రభుత్వం జిల్లాల పునర్విభజనపై తీసుకున్న నిర్ణయం మెంటాడ వాసులకు ఆశనిపాతంలా పరిణమించింది. ఇక నుంచి మెంటాడ మండలం పార్వతీపురం జిల్లాలోనే కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది.

మెరిట్ డే వేడుకలు

ప్రజాశక్తి -బొబ్బిలి

స్థానిక శ్రీనిధి పాఠశాలలో గురువారం మెరిట్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంఇఒలు గొట్టాపు వాసు, రమేష్ పాల్గొని ఇటీవల జరిగిన చెస్, కేరమ్స్, మేథ్స్ ఒలింపియాడ్, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు రౌతు రామ్మూర్తి, కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు, డాక్టర్ పి.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎంఇఒలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

న్యూ ఇయర్ వేడుకులకు వెళ్తూ ప్రమాదం

ప్రజాశక్తి - కొత్తవలస

నాగేశ్వరరావు (ఫైల్‌ఫొటో)

మండలంలోని పాత సంకరపాలెం గ్రామానికి చెందిన గనిశెట్టి నాగేశ్వరరావు (30) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వృత్తి రీత్యా ఐఎంఎఫ్ గోల్డ్ లోన్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా విశాఖపట్నంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే విధులు ముగించుకుని కుటుంబ సభ్యులతో న్యూయర్ వేడుకలు చేసుకుందామని కేకు పళ్ళు తీసుకొని బుధవారం అర్ధరాత్రి ఇంటికి వస్తుండగా అద్దన్నపాలెం గ్రామం వద్ద లారీని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. లారీకి ఎటువంటి లైట్లూ లేకపోవడం, వెనుక్కు వస్తున్నట్లు కనీసం సిగ్నెల్ ఇవ్వకపోవడంతో ముందున్న లారీ తనకు కనిపించక బైక్‌తో లారీను బలంగా ఢీ కొట్టాడు. దీంతో కాళ్లు, చేతులు విరిగిపోవడంతో పాటు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఏడాది పాప, భార్య ఉన్నారు. న్యూ ఇయర్ వేడుకులు చేసుకుందామని ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులకుఈ వార్త తెలియగానే తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

In the Honourable Court of the Senior Civil Judge Vizianagaram
IA 238/2024 O.S 89/2009

Between :
Suryadevara Varalakshmi ......Petitioner/Plaintiff
And:
Areti Adilakshmi and others ....Respondents/Defendants

NOTICE

R12: Karrothu Mangamma w/o Bangara Raju R/o Polipalli village, Bhogapuram Mandal Vizianagaram District.

పై నెంబరు పిటిషన్‌ను ఇందలి వాది దాఖలు చేసుకొని యున్నారు. మీకు నోటీసు అందజేసే నిమిత్తం ప్రత్యామ్నాయంగా పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. పై కేసు **తేది 27-01-2026న ఉదయం 10-30 గంటల**కు మీ హాజరు నిమిత్తం వాయిదా అయివున్నది. కావున మీరు స్వయంగా గాని, మీ తరపున లాయర్ ద్వారా గాని పై తేదిన పై కోర్టు ఎదుట హాజరై, మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనిచో మీపై పరోక్షంగా వున్న ఆధారాల మేరకు తీర్మానం జరుగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

P. Dhananjaya Rao
Advocate for Petitioner
Vizianagaram,
Cell : 9440711430

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు అయిన బులుసు కాశీ విశ్వనాథం గారు ఇచ్చిన బోగట్ట మేరకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యులు ఆస్తి తమ తండ్రి గారైన బులుసు నారాయణ మూర్తి గారికి వారి మేనత్త అయిన శ్రీమతిబీ ఆకెళ్ళ లక్ష్మిదేవి గారి వలన 1944 వ సం. వీలునామా ద్వారా ధకలుపడిన పిదప సదరాస్తికి నిర్వివాద హక్కుదారై అనుభవిస్తూ విజయనగరం మునిసిపాలిటి వారికి Assessment No: 1093023378 తొ అతని పేరున ఆస్తి పన్నులు చెల్లిస్తూ 1976 వ సం. లో కాలం చేసిన పిదప అతని కుమారుడుగా వారసుడైన నా క్లయింటు శ్రీ బులుసు కాశీ విశ్వనాధం గారు సదరాస్తి కి హక్కుదారై అనుభవిస్తూ తన తండ్రి గారి పేరునే ఇప్పటి వరకు ఆస్తి పన్నులు చెల్లిస్తూ యున్నారు, కాగ ఇక పై సదరు నిర్వివాదమైన ఆస్తి కి నా క్లయింటు పేరున ఆస్తి పన్ను చెల్లిన్చుకోనటకు గాను విజయనగరం మునిసిపాలిటి వారికి దరఖాస్తు చేసికొని యున్నారు, కావున ఈ విషయమై ఎవరికైనా ఎట్టి అభ్యంతరములు ఉన్నను ఈ దినము నుండి పది దినములులోగా వారి అభ్యంతరములు విజయనగరం మునిసిపాలిటి వారికి గాని, దిగువ తెలిపిన న్యాయవాదికి గాని తెలియజేయగలరు.

షెడ్యులు:- విజయనగరం జిల్లా విజయనగరం మండలం విజయనగరం మునిసిపాలిటి వార్డు నెం-19 అయ్యకోనేరు గట్టు, ప్రస్తుత Door No: 19-9-11, Assessment No : 1093023378గా గల నివేశన ఇల్లు.

భీంపల్లి రవి, న్యాయవాది, గౌతమినగర్,
విజయనగరం, ఫోన్ : 7382285022.

మహారాజశ్రీ బొబ్బిలి అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S. 292/2024

Between:
గేదేల రమణ ....వాది
And
కొల్లి సత్యవతమ్మ వగైరా ......ప్రతివాద్లు
To,
D5. కొల్లి రమణ, D/o లేటు సూర్యనారాయణ, వ॥ 37సం॥లు, W/o గాడి మహేష్, పక్కి గ్రామం, బొబ్బిలి మండలం, విజయనగరం జిల్లా.

పై నెంబరు దావాలో మీ తండ్రిగారు అయిన లేటు కొల్లి సూర్యనారాయణ తాలుకా ప్రాంశరీ నోటు బాకీ రాబట్టు నిమిత్తం, మీపై యిందలి వాది గారు యిందలి దావాను దాఖలు చేయగా మీ యొక్క హాజరు నిమిత్తం మీకు పలుమార్లు దావా సమన్లు పంపగా, మీరు తెలిసికోని తప్పించికోని తిరిగుచున్నందున యీ ప్రకటన మూలముగా మీకు సమను చేయుచున్నందున మీ యొక్క హాజరు నిమిత్తం **తే 23-01-2026దీన ఉ॥ 10-30ని॥లకు** మీరు గాని, మీ తరుపు లాయరు గారి ద్వారా హాజరు కావలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానం చేయుదురు.
(యీ ప్రకటన శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు ప్రచురించడమైనది)

ఇట్లు
గంటి గోపాలకృష్ణ శర్మ
అడ్వకేట్, బొబ్బిలి,
సెల్ : 9440192234

పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

రోడ్డు నిబంధనలు విధిగా పాటించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

రహదారి భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని, వాహన చోదకులు రహదారి నిబంధనలను విధిగా పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కలెక్టర్ తన ఛాంబర్ లో 'జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రూపొందించిన గోడ పత్రికలు, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రహదారిపై ప్రయాణించేటప్పుడు చిన్నపాటి అజాగ్రత్త పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 90 శాతం నిబంధనలు పాటించకపోవడం వల్లేనని పేర్కొన్నారు. వాహనదారులు తమ ప్రాణాలతో పాటు, తమపై ఆధారపడిన కుటుంబ సభ్యులు, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి దుర్గా ప్రసాద్ రెడ్డి, జిల్లా ఇంధన శకట తనిఖీదారులు, పరిపాలన అధికారి, సిబ్బంది ఉన్నారు.

పోలీసులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి

లక్ష్యాలను చేరుకోవాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి ఆధ్వర్యంలో నూతన సంవత్సరం వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. మన్యం జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు, స్పెషల్ బ్రాంచ్, డిసిఆర్‌బి, ఎఆర్, జిల్లా పోలీసు కార్యాలయంలో పని చేసే అధికారులు, సిబ్బంది, పలువురు సిఐలు, ఎస్సైలు సబ్ డివిజన్ వారీగా విచ్చేసి ఎస్‌పిని కలిసి పుష్పగుచ్ఛాలను, పూలమొక్కలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో అందరికీ మంచి శుభాలు జరగాలని, పోలీసుశాఖ నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకొనేలా సమర్థవంతంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని, ప్రజలందరికీ మంచి సేవలందిస్తూ పోలీసుశాఖ ప్రతిష్టను పెంచేలా పనిచేయాలని అన్నారు. నూతన సాంకేతికతను ఎక్కువగా వినియోగిస్తూ మరింత సమర్థవంతమైన పోలీసింగ్‌తో 2026లో జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ నూతన సంవత్సరంలో ప్రజలు, పోలీసు సిబ్బంది క్షేమంగా, సంతోషంగా ఉంటూ నిర్దేశించుకొన్న లక్ష్యాలను చేరుకొని, విజయాలు అందుకోవాలని, జిల్లా ప్రజలంతా శాంతియుత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, శాంతి భద్రతల సమస్యలు లేకుండా జీవించేలా పోలీసులు చేపట్టే చర్యలకు ప్రజలు కూడా తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు బాధ్యత కలిగిన పౌరునిగా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని కోరారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు ఎం.వెంకటేశ్వరరావు, మనీషా రెడ్డి, పాలకొండ డిఎస్‌పి రాంబాబు, ఎఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి, ఎస్‌బి సిఐ రమణమూర్తి , డిసిఆర్‌బి సిఐ ఆదాం, ఎఆర్ ఆర్‌ఐలు నాయుడు, రాంబాబు, శ్రీనివాసరావు, పలువురు సిఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, డిపిఒ సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతులకు పాట్లు

రెగ్యులర్ ఉద్యోగులు లేక ఇబ్బందులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని రావివలసలో గల ప్రభుత్వ గ్రామీణ పశువైద్యశాలలో రెగ్యులర్ ఉద్యోగులులేక పాడి రైతులు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ వైద్యశాలలో గతంలో పనిచేసిన జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ఉద్యోగోన్నతిపై బదిలీ కావడం, ఆయన స్థానంలో ఎవర్నీ నియమించకపోవడంతో పాడి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే ఉన్న సిబ్బంది కూడా సెలవుపై వెళ్లిన రోజుల్లో వైద్యశాల పూర్తిగా మూతపడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యాధికారులు, సిబ్బంది లేకపోవడంతో ఒక్కొక్కసారి పశు వైద్యశాల తలుపులు తెరవని పరిస్థితి నెలకొంది. ఈ పశు వైద్యశాలపై లఖణాపురం, రావివలస గ్రామాలకు చెందిన వందలాది పాడి రైతులు ఆధారపడి ఉన్నారు. కనీసం ఒక రెగ్యులర్ పారా వెటర్నరీ అధికారిని, కార్యాలయ సిబ్బందిని తక్షణమే నియమించాలని అధికారులను వారు కోరుతున్నారు.

రెగ్యులర్ ఉద్యోగుల లేక ఇబ్బందులు

తమ క్లస్టర్ పరిధిలో ఉన్న రావివలసలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ప్రమోషన్ వల్ల వేరే ప్రాంతానికి వెళ్లడం జరిగింది. అప్పటి నుంచి తోటపల్లి వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ పద్మ, అలాగే ఉల్లిభద్ర వెటర్నరీ అసిస్టెంట్ ఉమాను మూడురోజులకు ఒక్కరిని ఏర్పాటు చేశారు. ఇక్కడ సమస్యను ఉన్నతధికారుల దృష్టిలోకి తీసుకెళ్లడంతో అధికారులు సూచనలు మేరకు విధులు నిర్వహిస్తున్నాం.

డాక్టర్ ప్రవంతి
వైద్యాధికారిణి, నాగూరు పశువైద్యశాల.

సిబ్బంది లేక తెరుచుకోని పశు వైద్యశాల గేటు

మన్యంలో చలి పులి

వృద్ధులకు, పిల్లలకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో గత పది రోజులుగా చలి విపరీతంగా పెరిగింది. ఇటీవల కాలంలో అకాల వర్షాలు అధికంగా పడ్డాయి. దీంతో పాటు ఏజెన్సీ మొత్తం చెట్లు, కొండలు, ఆ పక్కన జలపాతాలు ఉండడంతో చలి మరింత విపరీతంగా పెరిగింది. ఉష్ణోగ్రతలు రానురానూ పడిపోతున్నాయి. ఇళ్ల గోడలు చల్లగా మారి ఇళ్లలోనే ఎముకలు కొరికేసే చలి వేస్తుంది. దీంతో వృద్ధులు, చిన్న పిల్లలకు అవస్థలు పడుతున్నారు. ఉదయం 9 గంటలైనా ఎండ కాయకపోవడంతో సూర్యరశ్మి కోసం ఎదురుచూస్తున్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచే చలి ప్రారంభమవుతుంది. సాయంత్రం 6గంటలయ్యేసరికి రోడ్లపైన ఎవరూ కనిపించక నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం మన్యంలో మంచు దుప్పటి మాదిరిగా కప్పేస్తుంది. ఉదయాన్నే వాహనాల ద్వారా వాకర్స్ జిమ్‌కు, యోగాకు వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి ఎంతైనా ఉంది. రోడ్డుపైన ఒకరి ముఖం ఒకరు కనిపించడం లేదు. దీంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

మరోవైపు ఇస్నోఫిలియో, ఆస్మా రోగులు ఇప్పటికే జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెప్తున్నారు. చలిగాలిలో తిరిగేవారు చెవులు, ముక్కు గొంతుతో బాధపడుతున్నారు. బయటకు వెళ్లేటప్పుడు మఫ్లర్, టోపీ వంటివి ఉపయోగించాలని సూచిస్తున్నారు. చలిని తట్టుకోలేక ఉదయం, రాత్రి వేళల్లో చలిమంటలతో జాగారం చేస్తున్నారు. అలాగే వేడి ఆహారం తీసుకోవాలని వైద్యులు సూచనలు ఇస్తున్నారు.

సీతంపేట ఏజెన్సీలో కురుస్తున్న పొగమంచు

శుభాకాంక్షల వెల్లువ

ప్రజాశక్తి - కురుపాం

మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి ఆధ్వర్యంలో గురువారం నూతన సంవత్సరం వేడుకలు చినమేరంగి కోటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో నూతన సంవత్సరం కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో నియోజకవర్గంలో ప్రజలంతా సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాలూరు : మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయనకు వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు రెడ్డి పద్మావతి, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి జిల్లా ప్రధానకార్యదర్శి దండి శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు.

జోగారావు ఇంట నూతన సంవత్సర వేడుకలు

పార్వతీపురంటౌన్ : మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు నివాసం వద్ద గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట, మండలాల వైసిపి అభిమానులు, కార్యకర్తలు, పట్టణంలో ఉన్న వైసిపి అభిమానులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపిటిసీలు, జడ్‌పిటీసీలు, మున్సిపల్ చైర్పర్సన్, వైస్ చైర్మన్లు, పట్టణ, మండల అధ్యక్ష కార్యదర్శులు ఎమ్మెల్యే జోగారావుతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు పుష్పగుచ్ఛాలని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జోగారావు మాట్లాడుతూ 2029 నాటికి వైసిపిని బలోపేతం చేసి మళ్లీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం జరుగుతుంది, కార్యకర్తలు అంతా సిద్ధంగా ఉండాలని అన్నారు.

సీతానగరం : మండలంలోని ప్రజా ప్రతినిధులు అధికారులకు తన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బి.రమణమ్మకు ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్, డిప్యూటీ ఎంపిడిఒ కె వర్మ, సచివాలయ డిప్యూటీ ఎంపిడిఒ శివప్రసాద్, పలువురు పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు పలువురు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తహశీల్దార్ జె.ప్రసన్నకుమార్‌కు డిప్యూటీ తహశీల్దార్ ఉమామహేశ్వరరావు, ఆర్ఐ ఎఎన్ శ్రీనివాసరావుతో పాటు ఇతర ఉద్యోగులు, విఆర్ఓలు శుభాకాంక్షలు తెలిపారు. వెలుగు సిబ్బంది ఎపిఎం భారతికి, సీతానగరం, పెద్ద అంకలాం పిహెచ్‌సి వైద్యాధికారులు పి.ఉషారాణి, పి.పావని, పి.శ్రీకాంత్‌కు ఆయా కార్యాలయాల సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు .

పాలకొండ : నూతన సంవత్సరం వేడుకలు మండలంలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. అధికారులు, అనధికారులు, రాజకీయ నాయకులు వేడుకలు నిర్వహించారు. డిఎస్‌పి ఎం.రాంబాబును పలువురు పోలీస్ సిబ్బందితో పాటు ఇతరత్రా నాయకులు కలిసి శుభాకాంక్షలు చెప్పారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఆకుల మల్లేశ్వరి, వైసిపి నాయకులు గువ్వల రమేష్‌బాబు, టిడిపి పట్టణ అధ్యక్షులు గంట సంతోష్ కుమార్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మక్కువ : నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని వైసిపి, టిడిపి మండల అధ్యక్షుడు రంగు నాయుడు, వేణుగోపాల్ నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు ప్రసాదరావునాయుడు, చార్టెడ్ అకౌంటెంట్ పి.తిరుపతిరావు ఇళ్ల వద్ద అభిమానులు కార్యకర్తలతో నూతన సంవత్సర ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలతో వివిధ శాఖల అధికారులతో పరస్పరం అభినందించుకున్నారు. కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు

కేక్ కట్ చేస్తున్న రాజన్నదొర



జోగారావు కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి
శుక్రవారం 2 జనవరి 2026

సామాజిక న్యాయం ఎక్కడ?

- రిజర్వేషన్లకు పాలకులు తూట్లు
- ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం
- 'శ్రామిక ఉత్సవ్' వేదికపై పలువురు వక్తలు

శ్రామిక ఉత్సవ్‌లో మాట్లాడుతున్న సినీ దర్శకుడు సత్యారెడ్డి, వేదికపై ధనలక్ష్మి, వైఎల్, సుబ్బన్న తదితరులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

దేశంలో సామాజిక న్యాయం కరువవుతోందని, రిజర్వేషన్లకు పాలకులు తూట్లు పొడుస్తున్నారని పలువురు వక్తలు అన్నారు. సిఐటియు 18వ అఖిల భారత మహాసభను పురస్కరించుకుని ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరుగుతున్న శ్రామిక ఉత్సవ్‌లో గురువారం 'సామాజిక న్యాయం - సాధనకు ఉద్యమిద్దాం' అనే థీమ్‌తో కార్యక్రమం తలపెట్టారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సినీ, రాజకీయ, సామాజిక రంగాల ప్రముఖులు పాల్గొని ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై గళమెత్తారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సినీ దర్శకులు సత్యారెడ్డి మాట్లాడుతూ చలనచిత్రం సమాజంలో మార్పు తీసుకువచ్చే అతిపెద్ద మీడియా వ్యవస్థ అని పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తాను నిర్మించిన 'ఉక్కు సత్యాగ్రహం' చిత్రం ప్రపంచవ్యాప్తంగా 150 థియేటర్లలో విడుదలై విజయవంతమైందని తెలిపారు. విశాఖలో 100 రోజులు ప్రదర్శితమైందని అన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యమ స్ఫూర్తితో సుద్దాల అశోక్ తేజ రాసిన పాటను తన చిత్రంలో వాడుకునేందుకు అనుమతించిన సిఐటియు నాయకులు సిహెచ్.నర్సింగరావు, అయోధ్యరామ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తన ఎదుగుదలకు ప్రజా యుద్ధనౌక గద్దర్ ఎంతో సహకరించారని, భవిష్యత్తులో ఉద్యమల స్ఫూర్తితో మరిన్ని చిత్రాలు తీసి ప్రజలను చైతన్యం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు సుబ్బన్న మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన రిజర్వేషన్లను ప్రభుత్వం తుంగలో తొక్కుతోందని విమర్శించారు. ఉపాధి హామీపై కేంద్రం దాడి పట్ల ఆయన నిప్పులు చెరిగారు. ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు డాక్టర్ వైఎల్.నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా, వైద్య రంగాల ప్రైవేటీకరణ విధానాల వల్ల సామాన్యులకు ఆ సేవలు భవిష్యత్తులో అందని ద్రాక్షగా మారుతాయని, దీనిపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సభకు అధ్యక్షత వహించిన సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి మాట్లాడుతూ 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టి, సామాజిక న్యాయాన్ని మాత్రం 125 అడుగుల లోతున పూడ్చిపెట్టారని తెలిపారు. మహిళా సాధికారత గురించి మాట్లాడే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుగా ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మనుధర్మ శాస్త్రం గురించి మాట్లాడే శక్తులు దళితులను, మహిళలను అణచివేస్తున్నాయని తెలిపారు. ఈ నెల 4వ తేదీన విశాఖలో జరిగే సిఐటియు బహిరంగ సభను జయప్రదం చేసి పాలకులకు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో శ్రామిక ఉత్సవ్ కన్వీనర్ కె.రమాప్రభ, దుశ్యంత్, ప్రముఖ న్యాయవాది వెంకటేష్, బి.నగేష్ పాల్గొన్నారు.

పుస్తక మహోత్సవం..
శ్రామిక చైతన్య వేదిక

సినీ దర్శకుడు సత్యారెడ్డి ప్రశంసలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ

అక్షరం ఆయుధంగా, జ్ఞానం మార్గదర్శిగా సాగే పోరాటాలే సమాజంలో మార్పును తీసుకువస్తాయి. ఈ సిద్ధాంతాన్ని పుణికిపుచ్చుకుని సిఐటియు అఖిల భారత మహాసభ సందర్భంగా నిర్వహిస్తున్న 'శ్రామిక ఉత్సవ్' ప్రస్తుతం విజ్ఞాన భాండాగారంగా విరాజిల్లుతోంది. ఈ ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన పుస్తక మహోత్సవం మేధావులను, పుస్తక ప్రేమికులను విశేషంగా ఆకర్షిస్తోంది. గురువారం సాయంత్రం ఈ పుస్తక ప్రదర్శనను ప్రముఖ సినీ దర్శకుడు, రచయిత, నిర్మాత సత్యారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి స్టాల్‌ను కలియతిరుగుతూ, అక్కడ కొలువుదీరిన వేలాది పుస్తకాలను పరిశీలించారు. ప్రజాశక్తి బుక్ హౌస్, సిఐటియు సహకారంతో ఇంత భారీ స్థాయిలో పుస్తక ప్రదర్శనను ఏర్పాటుచేయడం అభినందనీయమని ఆయన కొనియాడారు. సందర్శనలో భాగంగా సత్యారెడ్డి కేవలం పుస్తకాలను చూడటమే కాకుండా కొన్ని అరుదైన గ్రంథాల చరిత్రను, వాటి సేకరణ వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కాలంలో ఇన్ని వైవిధ్యమైన పుస్తకాలను ఒకే వేదికపై చూడటం అరుదైన విషయమని, సామాజిక చైతన్యాన్ని రగిలించే ఇటువంటి ప్రదర్శనలు నేటితరానికి ఎంతో అవసరమని ఆయన వ్యాఖ్యానించారు. సినిమా రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉన్న సత్యారెడ్డిని చూడగానే పుస్తక ప్రేమికులు, విద్యార్థులు ఉత్సాహం ప్రదర్శించారు. ఆయన కూడా ఎంతో వినమ్రంగా సందర్శకులతో ముచ్చటించి, వారితో ఫొటోలు దిగారు. పుస్తక పఠనం పట్ల యువత ఆసక్తి చూపడం శుభపరిణామమని ఆయన ఆనందం వ్యక్తంచేశారు. శ్రామిక ఉత్సవంలో భాగంగా జరుగుతున్న ఈ పుస్తక మహోత్సవం కేవలం పుస్తకాల అమ్మకపు కేంద్రంగానే కాకుండా, ఆలోచనల వేదికగా మారుతోంది. సత్యారెడ్డి వంటి ప్రముఖుల సందర్శన ఈ ఉత్సవానికి మరింత శోభను చేకూర్చింది.

పుస్తక ప్రదర్శనను సందర్శిస్తున్న సినీ దర్శకుడు సత్యారెడ్డి

సంస్కృతి విశాలమైనది

- పరిరక్షణకు రాజీలేని పోరాటాలు అవసరం
- మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, వేదికపై ఎస్.వెంకటరావు

ప్రజాశక్తి - గాజువాక

సంస్కృతి విశాలమైనదని, దాన్ని కాపాడుకోవడానికి రాజీలేని పోరాటాలు అవసరమని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆరు రోజులుగా జరుగుతున్న శ్రామిక ఉత్సవ్‌లో భాగంగా సాహిత్య వేదికపై గురువారం 'బహుళ సంస్కృతులు - భారతీయతత్వం' అన్న అంశంపై సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సంస్కృతి ఎలా అభివృద్ధి చెందిందీ వివరించారు. ఉమ్మడి సంస్కృతిలోనే జీవించే హక్కు, భాష, చిత్రలేఖనం, కలిసి జీవించి ఒకరి అవసరాలు ఒకరు తీర్చుకోవడం వంటివి వచ్చాయన్నారు. సైన్స్, టెక్నాలజీ ఈ సంస్కృతిలో నుంచే వచ్చాయన్నారు. ఉన్నతమైన మానవ విలువలు వైపు పెరగాలనేదే సంస్కృతి అని చెప్పుకొచ్చారు. అయితే ఆధిపత్య సంస్కృతి పేరుతో ప్రజల మధ్య గొడవలు పెట్టి అదాని లాంటి వ్యక్తులు దోపిడీ చేసుకోవడానికి పాలకులు అవకాశం కల్పిస్తున్నారన్నారు. ఆ దోపిడీపై ప్రజలు తిరగబడతారనే భయంతోనే ముందుగానే కుట్రలు చేస్తున్నారన్నారు. ప్రజలపై ఆధిపత్య సంస్కృతిని రుద్దుతున్నారన్నారు. ఇటువంటి తరుణంలో వీరబ్రహ్మం, వేమన, మొల్ల రాసిన గ్రంథాల్లోని అభ్యుదయవాదాలను ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. ఆదిపత్య వైఖరిపై పోరాటం చేయాలన్నారు. మోడీ ప్రభుత్వం చరిత్రను వక్రీకరిస్తోందని అన్నారు. విశ్వ మానవ సంస్కృతిని కాపాడేందుకు అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్.వెంకటరావు మాట్లాడుతూ ఒక సంస్కృతిని చూసి మరొక సంస్కృతి పాటిస్తున్నవారు అసూయపడుతున్నాయన్నారు. సంస్కృతి అభివృద్ధి చెందాలే తప్ప అసూయ పెరగరాదన్నారు. దేశంలో వేషధారణలోనూ, ఆహారంలోనూ, నడవడికలోనూ ఒకరిని ఒకరు అసహ్యించుకోవడం పెరిగిందన్నారు. చైనాలో ఈ విధమైన విధానాలు లేవని తెలిపారు. ప్రొఫెసర్ డాక్టర్ ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ, బహుళ సంస్కృతి కలయికే భారతీయతత్వం అన్నారు. అన్ని సంస్కృతులనూ కాపాడుకోవాలన్నారు. యు.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌పై పి.శ్రీనివాసరావు పాడిన పాట ఆకట్టుకుంది. సభానంతరం అతిథులకు నిర్వాహకులు జ్ఞాపికలు అందజేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం, పార్వతీపురం మన్యం
శుక్రవారం 2 జనవరి 2026



మహాసభలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

సిఐటియు మహాసభ దృశ్యమాలిక

విశాఖ సాగర తీరంలోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న సిఐటియు అఖిల భారత మహాసభ గురువారానికి రెండోరోజుకు చేరుకుంది. కార్యదర్శి నివేదికపై ప్రతినిధులు చర్చలు జరిపారు. దేశంలోని కీలక పోరాటాల్లో పాల్గొన్న వారంతా ఇక్కడకు రావడంతో ఉత్తేజపూరిత వాతావరణం నెలకొంది.



ప్రజాశక్తి బుక్‌స్టాల్ వద్ద కేరళ కార్మిక శాఖ మంత్రి శివన్‌కుట్టి

పాలస్తీనాకు మద్దతు

వేదికపై హేమలత, వరలక్ష్మి, సింధు మాటామంతి

విజూకృష్ణన్‌కు జ్ఞాపిక అందజేత

మహాసభ ప్రాంగణంలో తపన్‌సేన్, సిహెచ్.నర్సింగరావు

మహాసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

ఉత్సవ్ వేదికపై కళాకారుల నృత్య ప్రదర్శన

ఆట.. పాట.. అదరహో

'శ్రామిక ఉత్సవ్'లో ఆకట్టుకుంటున్న కళారూపాలు

ఉద్యమ ఘట్టాలను తన హావభావాలతో రక్తికట్టిస్తున్న కళాకారుడు

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి

సిఐటియు అఖిల భారత మహాసభ నేపథ్యంలో ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శ్రామిక ఉత్సవ్ పేరిట ప్రజానాట్య మండలి కళాకారులు ఆరో రోజు గురువారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆట, పాట, పలు అభ్యుదయ గేయాలు, నృత్య రూపకాలు సభికులకు ఆద్యంతం ఆలోచింపజేశాయి. ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, మున్సిపల్, జివిఎంసి, తదితర రంగాల, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యాన చేపట్టిన, నిర్వహిస్తున్న ఐక్యపోరాటాలను, సాధించిన హక్కులను గుర్తుచేస్తూ 'పోరాటాల సంఘమో.. సిఐటియు సంఘమో' అంటూ ప్రజానాట్య మండలి కళాకారులు పాడిన పాట ఆలోచింపజేసింది. జివిఎంసి కార్మికులు ప్రదర్శించిన తీన్‌మాన్ సభికులను ఆకట్టుకుంది. 'అమ్ముతుంటే చూస్తామా.. ప్రభుత్వ రంగాన్ని', 'ప్రయివేటు భూతం లేచింది బిడ్డా', 'పాడి ఆవును అమ్మేసి.. పాలు కొనుక్కుందామా'.. అంటూ ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలను ఎలా కార్పొరేట్లకు పాలకులు కట్టబెడుతున్నదీ కళాకారులు వివరించారు.

'తలకు మించి పరుగెత్తి.. తెల్ల ఏనుగు అంటారు' అంటూ ప్రభుత్వ రంగం ప్రాధాన్యతను వివరిస్తూ 'సబ్సిడీలు ఇచ్చింది.. సాయంగా వచ్చింది', 'గుడ్డిలోన మెల్ల లాగ.. ఆపదలో అన్న లాగ' అంటూ కళాకారులు పాడిన పాట ఆహూతులను హత్తుకుంది.

మన రక్తం ధారబోసి పెంచిన సంపదను కార్పొరేట్లకు కట్టబెడితే ఊరుకోబోమని హెచ్చరిస్తూ 'పోనీ అనుకోవద్దు.. పొలికేకై నిలదీద్దాం' అంటూ కళాకారులు పాడిన పాటకు సభికుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. సభా ప్రాంగణం చప్పట్లతో మార్మోగింది.

'సంపద సృష్టికి మూలం.. చెమట చుక్కరే అన్నా' అంటూ 'పొలాల్లో పంటలు పండించడంలోనూ, పరిశ్రమల్లో యంత్రాలు, యంత్ర పరికరాల తయారీలోనూ వ్యవసాయ కూలీలు, కార్మికులు పడే కష్టాన్ని వివరించే ప్రయత్నం చేశారు కళాకారులు. 'ఏళ్లయినా ఏలికలు మారినా.. మారలేదు మన బతుకులు' అన్న పాట ద్వారా శ్రమజీవుల పట్ల పాలకుల వైఖరిని కళ్లకు కట్టినట్లు కళాకారులు వివరించారు. హక్కుల కోసం ఎర్రజెండా అండగా ఉందని చెబుతూ 'ఎర్రెర్రని జెండా చేత బట్టి శ్రామిక రాజ్యం తేవాలి' అంటూ పాడిన పాట చైతన్యం నింపింది.

సరోజ బృందం ఆధ్వర్యాన వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ చిన్నారులు ప్రదర్శించిన 'జాగోరె జాగో' ప్రదర్శన ఆకట్టుకుంది. భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో యువత పోరాటాల ద్వారానే భవిష్యత్తు ఉందని చెబుతూ 'యువతతోనే భవిత సాధ్యం.. నేటి మాట సత్యం' అన్న పాట అందరినీ ఆలోచింపజేసింది. 'ఆశయాల భవిత మనది.. దారి చూపు వెలుగు మనది' అంటూ పాడిన పాట యువత పోరాటాల మార్గాన్ని ఎంచుకోవాలన్న సందేశాన్ని ఇచ్చింది.

'సమ్మె నీ జన్మ హక్కు రా.. దాన్ని ఆపే దమ్మెవడికి ఉందిరా' అంటూ ఉప్పు సత్యాగ్రహం దర్శకులు, నటులు సత్యారెడ్డి పాడిన పాటకు సభికుల నుంచి స్పందన లభించింది. ఉత్తరాంధ్ర ప్రజా గాయకులు వంగపండు ప్రసాదరావు పాడిన 'ఎం పిల్లడో ఎల్దమొస్తవో.. చికాకుళం కడ చీమకొండ కడ' అంటూ ఆయన కుమారుడు దుష్యంత్ పాడిన పాటకు సభికులు చప్పట్లతో సభాస్థలి మార్మోగింది.

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవిత చరిత్రపై కాకినాడ ప్రజానాట్య మండలి కళాకారుల బృందం నృత్యరూపకాన్ని ప్రదర్శించింది. జాతీయోద్యమంలో సుందరయ్య పాత్ర, ఆయన చేసిన త్యాగాన్ని వివరించారు. ఏ రూపంలోనైనా దోపిడీని సుందరయ్య ధీటుగా ఎదురొడ్డిన వైనాన్ని వివరించారు కళాకారులు. సైకిల్‌పై నెల్లూరు వెళ్లి టోకుగా నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి దళితవాడల్లో అందజేసిన సుందరయ్య మానవత్వాన్ని చాటిచెప్పారు. 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం సజీవంగా చూపిన వాడు సుందరయ్య' అంటూ కమ్యూనిస్టు యోధుని ఔన్నత్యాన్ని వివరించారు.

శ్రమజీవి విశిష్టతను తెలియజెబుతూ కళాకారిణి ప్రదర్శన

విప్లవ గేయాలను ఆలపిస్తున్న ప్రజానాట్య మండలి కళాకారులు

శ్రమ విశిష్టతను తెలియజెబుతూ కళాకారుల నృత్యరూపకాలు

ప్రదర్శనలతో చైతన్యం రేకెత్తిస్తున్న కళాకారులు

ప్రభుత్వ రంగంపై కార్పొరేట్ల దోపిడీని వివరిస్తూ సాగిన కళా ప్రదర్శన

అంతిమ విజయం కార్మికులదేనంటూ సాగిన సన్నివేశం

ప్రశంసాపత్రాలతో కళాకారులు

యువత డ్యాన్స్

కార్మికుల పోరుతో దిగొచ్చిన యుబి

లాభాలే తప్ప కార్మికులు ఖాళీ కడుపుతో ఉన్నా తమకేమీ సంబంధం లేనట్టుగా కొన్ని కంపెనీలు వ్యవహరిస్తున్నాయి. ఉత్పత్తి తగ్గిందనే పేరుతో పనిదినాలకు కోత పెట్టి వారిని పస్తులు ఉండేలా చేస్తున్నాయి. ఉత్పత్తి పెరిగినా, లాభాలు వచ్చినా పని దినాలు పెంచడానికి ససేమిరా అంటున్నాయి. కార్మికులు కడుపు మండి ఆందోళనలు చేస్తే, అప్పుడు దిగొచ్చి పని ఇచ్చేందుకు అంగీకరిస్తున్నాయి. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం బంటుపల్లిలోని యునైటెడ్ బ్రేవరీస్ కంపెనీ ఇదే కోవలోకి వస్తుంది. యాజమాన్యం తీరుపై యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కార్మికులు పలురూపాల్లో పోరాటం సాగించిన తర్వాత పని దినాలను పెంచింది. కార్మికుల తొలగింపు నిర్ణయాన్ని విరమించుకుంది.

ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు (ఫైల్)

- **ఉత్పత్తి తగ్గిందని పనిదినాల కోత**
- **పలురూపాల్లో ఆందోళనలు చేసిన శ్రామికులు**
- **కార్మికుల తొలగింపును అడ్డుకున్న సిఐటియు**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రణస్థలం మండలం బంటుపల్లిలోని యునైటెడ్ బ్రేవరీస్ కంపెనీలో సుమారు 600 మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం విధానంతో తమకు ఆర్డర్లు తగ్గాయని, ఎక్కువ రోజులు పని ఇవ్వలేమని కంపెనీ యాజమాన్యం చేతులెత్తేసింది. నెలలో ఏడు నుంచి పది రోజులు మాత్రమే పని ఇచ్చి మిగిలిన రోజులు కార్మికులను ఇళ్లకే పరిమితమయ్యేలా చేసింది. దీనిపై కార్మికులు భగ్గుమన్నారు. యాజమాన్యం తీరును నిరసిస్తూ యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కార్మికులు జాతీయ రహదారి దిగ్బంధనం, చలో కలెక్టరేట్, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా, రణస్థలంలో ర్యాలీ, భిక్షాటన తదితర రూపాల్లో ఆందోళనలు చేపట్టారు. పనిలో నుంచి 300 మంది కార్మికులను తొలగించాలని ప్రయత్నిస్తున్న సందర్భంలో ఆందోళనలు ఉధృతం కావడంతో యాజమాన్యం వెనక్కి తగ్గింది. కార్మికులకు కొన్ని రోజులపాటు పని ఇవ్వడానికి కూడా నిరాకరించడంతో, కార్మికులు ఆందోళనతో వారం రోజుల పాటు పని కల్పించింది.

పనిదినాలు పెంచిన యాజమాన్యం

2024 ఎన్నికల ముందు వరకు వారం, పది రోజుల పాటు పని కల్పించిన యాజమాన్యం, ప్రస్తుతం 13 రోజుల వరకు పని కల్పిస్తోంది. కంపెనీ ఉత్పత్తి, వ్యాపార విస్తరణ పెరిగినా ఆ మేరకు కార్మికులకు పని కల్పించడానికి మాత్రం అంగీకరించడం లేదు. కంపెనీ వ్యవహారాల్లో బిజెపికి చెందిన ఓ ప్రజాప్రతినిధి జోక్యం చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తన మనుషులకు చెందిన కొందరికి కంపెనీలో పని ఇవ్వాలని హుకుం జారీ చేయడంతో, అదనంగా కొంతమందికి పని కల్పించినట్టు తెలుస్తోంది. దీంతో ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులకు 13 రోజులకు మించి పని దొరకని పరిస్థితి నెలకొంది.

లఘుచిత్రాలు.. సామాజిక చైతన్యానికి ప్రతిబింబాలు

కళ కేవలం వినోదానికే కాదు.., అది సమాజాన్ని మేల్కొలిపే ఆయుధమని విశాఖ వేదికగా నిరూపితమైంది. సిఐటియు 18వ అఖిల భారత మహాసభ ముందస్తు వేడుకల్లో భాగంగా ఆంధ్రా యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'శ్రామిక ఉత్సవ్' అట్టహాసంగా సాగింది. వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ సమన్వయంతో జరిగిన లఘు చిత్రాల ప్రదర్శన.. సమకాలీన సమస్యలను, శ్రామిక జీవుల వ్యధలను, రాజకీయ వైఫల్యాలను అత్యంత శక్తివంతంగా వెండితెరపై ఆవిష్కరించింది. ప్రదర్శనలో భాగంగా సుమారు 4 రోజుల పాటు 30 లఘు చిత్రాలను ప్రదర్శించారు. పద్మశ్రీ సుద్దాల అశోక్‌తేజ, ప్రముఖ నటి రోహిణి, మాదాల రవి, విఎంఆర్‌డిఎ కమిషనర్ ఎన్.తేజ్‌భరత్, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ వంటి ప్రముఖులు ఈ ప్రదర్శనలకు హాజరై.. దర్శకులను అభినందించడం విశేషం.

లఘుచిత్రాల ప్రదర్శనను తిలకిస్తున్న ఆహూతులు

తెరపై ప్రదర్శిస్తున్న లఘుచిత్రం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ

వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ అంశం లఘుచిత్రాల ప్రదర్శనలో ప్రధానంగా నిలిచింది. సుదీప్ సాయి రూపొందించిన 'వైజాగ్ స్టీల్‌ప్లాంట్', కౌశిక్ దర్శకత్వంలో వచ్చిన 'సేవ్ స్టీల్‌ప్లాంట్', చంద్రశేఖర్ తెరకెక్కించిన 'మహా వృక్షం' లఘు చిత్రాలు స్టీల్‌ప్లాంట్‌ను కేవలం ఒక ఫ్యాక్టరీగా కాకుండా, వేలాది కుటుంబాల జీవనాధారంగా, ఆంధ్రుల ఆత్మగౌరవ ప్రతీకగా చూపాయి. శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'మై ఓట్ నాట్ ఫర్ సేల్' చిత్రం ఓటును నోటుకు అమ్ముకోవడం వల్ల ప్రజలు తమ ఐదేళ్ల భవిష్యత్తును ఎలా తాకట్టు పెడుతున్నారో కళ్లకు కట్టినట్లు చూపింది. ఆర్.భార్గవ రాయ్ రూపొందించిన 'ఫ్రీడమ్ ఆర్టికల్ 21' వ్యక్తిగత స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కుల ప్రాముఖ్యతను ప్రశ్నించింది. నగరాన్ని శుభ్రం చేసే పారిశుధ్య కార్మికుల జీవితాలపై కె.మహేష్ బాబు తీసిన 'అన్సంగ్ హీరోస్', పుష్యమి దర్శకత్వం వహించిన 'శ్రామిక జీవన సౌందర్యం' చిత్రాలు వారి నిస్వార్థ సేవను, వారు ఎదుర్కొంటున్న సామాజిక వివక్షతను హృద్యంగా ఆవిష్కరించాయి. కొత్తపల్లి సీతారాం నిర్మించిన 'వీరి బతుకు' ఉత్తరాంధ్ర జనజీవన కష్టాలను ప్రతిబింబించింది. నేటి యువత ఎదుర్కొంటున్న సవాళ్లపై పలు చిత్రాలు చర్చించాయి. ఫ్యుబె క్రియేషన్స్ వారి 'ఎఫ్ 2' నిరుద్యోగ యువత ఆవేదనను చూపగా, దామోదర్ దర్శకత్వంలో వచ్చిన 'యుద్ధం ప్రకటించు', 'ఇది ఆరంభం' చిత్రాలు డ్రగ్స్ మహమ్మారిపై యువత పోరాడాలని పిలుపునిచ్చాయి. పి.రమేష్ కుమార్ తీసిన 'జయహే' మత సామరస్యాన్ని ప్రబోధించగా, సనరా వంశి రూపొందించిన 'మాతృదేవోభవ' వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించింది. ఉమామహేష్ దర్శకత్వంలోని 'ఇంక్' చిత్రం కలం బలాన్ని, మేధావి వర్గం సమాజం పట్ల చూపాల్సిన బాధ్యతను చాటిచెప్పింది. భీశెట్టి జయబాబు రూపొందించిన 'బాల్యవివాహాలు నిర్మూలిద్దాం' చిత్రం ఆడపిల్లల హక్కుల కోసం గళమెత్తింది.

లఘుచిత్రాల ప్రదర్శనను తిలకిస్తున్న విఎంఆర్‌డిఎ కమిషనర్ తేజ్‌భరత్

ప్రముఖుల ప్రశంసలు - ప్రోత్సాహం

లఘుచిత్రాల ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ వాస్తవికతకు దగ్గరగా సినిమాలు తీయడం అభినందనీయమన్నారు. నటి రోహిణి, మాదాల రవి.. చిత్రాల నాణ్యతను, దర్శకుల సామాజిక స్పృహను కొనియాడారు. కేవలం విశాఖకే కాకుండా విజయవాడ, నిడదవోలు, శ్రీకాకుళం వంటి ప్రాంతాల కళాకారులకు ఇది ఒక గొప్ప వేదికగా నిలిచిందని నిర్వాహకులు ఎల్లాజీ, కుమార్ రాజా పేర్కొన్నారు. ఈ లఘు చిత్రాల ప్రదర్శన కేవలం ఒక కళా ప్రదర్శనగా మాత్రమే కాకుండా, సామాజిక మార్పు కోసం ఒక గళంగా నిలిచింది. కార్మికుల హక్కులు, సామాజిక బాధ్యత, దేశ భవిష్యత్తుపై చర్చను రేకెత్తించడంలో ఈ 'శ్రామిక ఉత్సవం' విజయవంతమైంది. భవిష్యత్తులో కార్మిక సమస్యలపై మరిన్ని చిత్రాలు రాబోతున్నాయని ప్రకటించడం ఈ ఉద్యమ స్ఫూర్తికి నిదర్శనం.

వికలాంగ పిల్లలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వల్లంపూడి ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రంలో వికలాంగ పిల్లలకు గురువారం దుస్తులను పంపిణీ చేశారు. విశాఖపట్నం జిల్లా మురళీనగర్‌కు చెందిన పి. దుర్గాప్రసాద్ తన పుట్టినరోజు వేడుకలు వికలాంగ పిల్లల మధ్య జరుపుకున్నారు. ఇందులో భాగంగా దుర్గాప్రసాద్ భార్య అలేఖ్య, రామలక్ష్మి, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక అవసరాల పిల్లలతో కలిసి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, 'ప్రత్యేక అవసరాలు గల పిల్లల మధ్య తమ కుటుంబ సభ్యుడి పుట్టినరోజును జరుపుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు ఇలాంటి పిల్లలకు సహాయం చేయడం మన అందరి బాధ్యత అని అన్నారు.

దుస్తులను పంపిణీ చేస్తున్న ప్రసాద్ కుటుంబ సభ్యులు

ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం సహిత ఉపాధ్యాయులు యన్. సత్యవతి, సి.హెచ్. జయంతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభకు హాజరవ్వండి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయి గ్రామంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జరిగే గ్రామ సభకు రైతులు హాజరు కావాలని తహశీల్దార్ జె.రాములమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా కోమటి చెరువు కింద సర్వే నంబర్లు 26,27,28,29,30 కి సంబంధించిన రైతులు వారి వన్‌బి, డాక్యుమెంట్లు పట్టుకునే సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఎంపిడిఒగా పోలినాయుడు

ప్రజాశక్తి- రేగిడి

మండల అదనపు ఎంపిడిఒగా టి. పోలినాయుడు (పంచాయతీరాజ్) బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఖండ్యాం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ అదనపు బాధ్యతలను గురువారం స్వీకరించారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ఇఒపిఆర్‌డి ఎవి సత్యనారాయణ అదనపు బాధ్యతలు చూసినప్పటికీ అనారోగ్యం కారణంగా మెడికల్ లీవ్‌లో ఉన్నారు. అనంతరం అదనపు ఎంపిడిఒగా కెవివి జగన్నాథరావు పనిచేసి ఇటీవల పదోన్నతిపై వెళ్లడంతో ఖాళీ ఏర్పడగా అదనపు ఎంపిడిఒగాపోలినాయుడును సబ్ కలెక్టర్ నియమించారు. ఈ సందర్భంగా పోలినాయుడును పలువురు అభినందించారు.

రామమందిరానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

విజయనగరం బాబామెట్టలో నిర్మిస్తున్న బాలక్ రామమందిర్‌కు శ్రీవాసవి చారిటీ మిత్రుల గ్రూప్, వాసవి క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో రూ 1,11,111 లు అందజేశారు. ఆలయ అధ్యక్షులు కుసుమంచి సుబ్బారావుకు వాసవి చారిటీ గ్రూప్ అధ్యక్షులు ఆలవెల్లి శేఖర్ వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ తమ్మన కళ్యాణ్ రాజు చెక్‌ను ఆలయం వద్ద గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కన్వీనర్ పువ్వాడ శ్రీహరి, చారిటీ గ్రూప్ కార్యదర్శి డిమ్స్ రాజు, కోశాధికారి సముద్రాల నాగరాజు, జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షులు కుంకాల పండు తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందిస్తున్న చారిటీ గ్రూప్ ప్రతినిధులు

కోటలో కోలాహలం

కార్యకర్తలు, అభిమానుల మధ్య నూతన సంవత్సర వేడుకలు

కేక్ కట్‌చేసిన ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరంకోట

స్థానిక ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మిగజపతిరాజు గువారం నూతన సంవత్సర వేడుకలను పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. పలువురు ఎమ్మెల్యేకు పుస్తకాలను, పూల మొక్కలను ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారి సమక్షంలో ఎమ్మెల్యే 10 కేజీల భారీ కేకలు కట్ చేసి విద్యార్థులకు తినిపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 2026వ సంవత్సరంలో ప్రజలకు అంతా మేలు జరగాలని, ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుచూపుతో చేస్తున్న పరిపాలనతో జిల్లాలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రోడ్లు, కాలువలు, తాగునీటి సదుపాయం, విద్య, వైద్యంకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా కూటమి 18 నెలల పాలనపై టిడిపి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

కేలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదితి

ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, పట్టణ అధ్యక్షులు గంటా రవి, ప్రధాన కార్యదర్శి కోదండరాం, మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలినాయుడు, ప్రధాన కార్యదర్శి పాశి అప్పలనాయుడు, నియోజకవర్గంలో మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న ఎస్‌పి దామోదర్

లక్ష్యాలను చేరుకోవాలి : ఎస్‌పి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

నూతన సంవత్సర వేడుకలు విజయనగరం పోలీసు కార్యాలయంలో గురువారం ఘనంగా జరిగాయి. ఎఎస్‌పి పి.సౌమ్యలత, డిఎస్‌పిలు ఆర్.గోవిందరావు, జి.భవ్యరెడ్డి, ఎస్.రాఘువులు, ఎమ్.వీరాకుమార్, డిటిసి డిఎస్‌పి పి.నారాయణ రావు, ఎఆర్ డిఎస్‌పి .కోటిరెడ్డి, ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, ఎస్.విద్యాసాగర్, పలువురు సిఐలు, ఎస్‌ఐలు, ఆర్ఎస్‌ఐలు, పట్టణ ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఎస్‌పిని కలిసి నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భగా ఎస్‌పి దామోదర్ మాట్లాడుతూ – ఈ నూతన సంవత్సరంలో అందరికీ శుభాలు జరగాలని, పోలీసుశాఖ నిర్దేశించుకున్న లక్ష్యాలుకు చేరుకొనే విధంగా సమర్ధవంతంగా ప్రతీ ఒక్కరూ పనిచేయాలని తెలిపారు. జిల్లా ప్రజలంతా శాంతియుత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, శాంతి భద్రతల సమస్యలు లేకుండా జీవించే విధంగా పోలీసులు చేపట్టే చర్యలకు ప్రజలు కూడా తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. అంతేకాకుండా, జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు బాధ్యత కలిగిన పౌరునిగా ప్రతీ ఒక్కరూ వ్యవహరించాలని కోరారు. అనంతరం ఎస్‌పి సతీ సమేతంగా కేక్ కట్ చేసి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

జెఎన్‌టియులో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జెఎన్‌టియుజివిలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విసి ప్రొఫెసర్ వి.వి. సుబ్బారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి నూతనంగా ఏర్పాటుచేసిన క్యాంపస్ హిల్లాక్ వాకింగ్ ట్రాక్‌ను (వ్యాహ్యాళి మార్గం) ప్రారంభించి, అందరితో కలిసి నడక కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా జెఎన్‌టియు జివి నూతన సంవత్సర కేలెండర్‌ను ఆవిష్కరించారు. 'ప్రక తితో కలిసి నడుద్దాం– ప్రగతిని సాధిద్దాం' అనే నినాదంతో ఈ నడకదారి కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ఈ నూతన సంవత్సరాన్ని మనమందరం ఆరోగ్యంతో, ఆనందంతో, ప్రకృతితో మమేకమై జీవిస్తూ, సమాజానికి ఒక మంచి సందేశాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. జీవితంలో ఏది సాధించాలన్నా ఆరోగ్యం అత్యంత ముఖ్యమని, నేటి బిజీ జీవనశైలిలో 'సమయం లేదు సార్', 'పని ఎక్కువ సార్', "టెన్షన్ ఎక్కువ సార్' అనే మాటలతో మన ఆరోగ్యాన్ని మనమే నిర్లక్ష్యం చేస్తున్నామని ఉపకులపతి గారు ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని దృష్టిలో పెట్టుకుని జెఎన్‌టియును ఒక హెల్తీ క్యాంపస్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పంతో, "ఆరోగ్యం కోసం ఒక గంట ప్రకృతితో అనే కార్యక్రమాన్ని గత ఏడాది డిసెంబర్ 6 న ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి శనివారం సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు, ప్రతి విద్యార్థి, ఉద్యోగి ప్రకృతితో మమేకమై ఆరోగ్యకర జీవనశైలిని అలవరచుకునేలా విశ్వవిద్యాలయం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. నేడు ప్రారంభించిన ఈ వాకింగ్ ట్రాక్ నిజంగా ఆరోగ్యానికి దారి చూపించే మార్గం అని అన్నారు. కార్యక్రమములో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, డైరెక్టర్లు, ఇంజినీరింగ్ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కేలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెఎన్‌టియు ప్రతినిధులు

కొళాయిలను ప్రారంభిస్తున్న నాయకులు

కుళాయిలు ప్రారంభం

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని ఆకులకట్టలో ఇంటింటికీ సురక్షితమైన తాగునీరు అందించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన కుళాయిలను గురువారం సర్పంచ్ ఉయ్యాల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ రావిపల్లి సింహాచలం నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి వద్దకే తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కొళాయిలను ఏర్పాటు చేసిందన్నారు. గతంలో తాగునీటి కొరత కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని, ఇప్పుడు ప్రతి ఇంటికీ పైపులైన్ ద్వారా స్వచ్ఛమైన నీరు అందుబాటులోకి రావడం కష్టాలు తప్పాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి గ్రామసభలు

ప్రజాశక్తి - వేపాడ

గతంలో రీ సర్వే చేసిన భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేసేందుకు గ్రామ సభలను ఏర్పాటు చేయనున్నామని డిటి రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2న జమ్మాదేవిపేటలో 78 మంది రైతులకు, 3న బిటికె.రాజపురంలో 62 మందికి, 5న ఎన్‌కెఆర్‌పురంలో 176 మందికి, అరుణనాయుడుపేటలో 143 మందికి, 7న బానాదిలో 334 మందికి, 8న చామలపల్లెలో 341 మంది రైతులకు పాసుపుస్తకాలను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

కార్పెంటర్ సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - బొబ్బిలి

కార్పెంటర్ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీరామా కర్ర పని వారల అండ్ రాడ్ బెండింగ్ పనివారల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అలజంగి వీరాచారి, ఉపాధ్యక్షులుగా పట్నాల గౌరీశంకర్రావు, ప్రధాన కార్యదర్శిగా బల్లంకి సతీష్, కోశాధికారిగా అలజంగి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీగా మత్తుర్తి చెన్నకేశవరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆ అధికారి మారక తప్పదు?

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో కీలకంగా ఉన్న ఓ అధికారి బదిలీ చేసే పరిస్థితి కనిపిస్తుంది. పూర్తిగా నగర పంచాయతీ పరిస్థితి అధ్వానంగా ఉండడంతో పాటు పలు సమస్యలు పేరుకుపోతున్నాయి. డంపింగ్ యార్డ్ విషయంలో కూడా చొరవ తీసుకోవడం లేదు. అదేవిధంగా నగర పంచాయతీల సమస్యలపై కూడా దృష్టి పెట్టిన పరిస్థితి కనిపించడం లేదు. దీంతో పట్టణవాసులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఎమ్మెల్యే కూడా ఈ విషయంలో దృష్టి పెట్టినట్లు తెలుస్తుంది. సమర్ధవంతంగా అధికారి పనిచేయకపోతే ఇబ్బందులు వస్తాయని ఎమ్మెల్యే అనుచరులు దగ్గర అన్నట్లు తెలుస్తుంది. దీంతో ఈ అధికారిని బదిలీ చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తుంది.

పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు, సిబ్బంది తదితరులు
- ప్రజాశక్తి, పార్వతీపురం

రాకపోకలు నిలిపివేత

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి-భగవాన్‌పురం మార్గంలో రహదారి విస్తరణ పనులు చేపడుతున్నారని పంచాయతీరాజ్ ఎఇ ఎస్.లక్ష్మణరావు గురువారం తెలిపారు. ఈ నేపథ్యంలో టెక్కలి రైల్వేస్టేషన్ రోడ్డు నుంచి ఎన్‌టిఆర్ నగర్ వరకు పది రోజుల పాటు రాకపోకలు నిలిపివేస్తున్నామని అన్నారు. రోడ్ విస్తరణ, ఇరువైపులా కాలువల నిర్మాణం చేపడుతున్న తరుణంలో పనులకు ఆటంకం లేకుండా ఉండాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు ఈనెల 3న శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్ శాఖ ఎఇ సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌లైన్లు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించడంతో పాటు ఎపి ట్రాన్స్‌కో టవర్స్ నిర్మాణం, ఇతర మరమ్మతులు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలోని టౌన్ ఫీడర్‌కు సంబంధించి పొందూరు, జోగన్నపేటతో పాటు కొంచాడ ఇండస్ట్రియల్ పరిధిలో గల గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని కోరారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- అరసవల్లి

మిమిక్రీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా గురువారం ఖ్యాతి ఫౌండేషన్ వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు, మహిళలకు దుప్పట్లు, చీరలు, లుంగీలు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. ఆదెవిధంగా అనురాగ నిలయంలో అనాథ చిన్నారులకు రొట్టెలు, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో కామేశ్వరరావు, శివప్రసాద్ దంపతులు, బరాటం వాసుదేవరావు దంపతులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన తహశీల్దార్

ప్రజాశక్తి- పలాస

కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌ను కూడలి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు డిప్యూటీ తహశీల్దార్ వాయిలపల్లి గిరి రాజు, విఆర్‌ఒ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోర్ల శ్రావణ్‌కుమార్, ఆర్‌ఐ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

లైసెన్స్ ఇంజినీర్ల సర్వేయర్ల అండ్ ఆర్కిటెక్ట్స్ అసోసియేషన్ తరుపున ఇచ్ఛాపురం పురపాలక సంఘం కమిషనర్ నల్లి రమేష్‌తో నూతన సంవత్సర 2026 డైరీని గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో లైసెన్స్ ఇంజినీర్ సర్వేయర్ జోనల్ కో-ఆర్డినేటర్ వేదుల సంతోష్‌కుమార్, మున్సిపల్ ఎఇ కిషోర్‌కుమార్, ఇన్‌ఛార్జి టిపిబిఒ చంటి, పట్టణ ప్రణాళిక సెక్రటరీ లలిత్ కుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ఆమదాలవలస: పురపాలక సంఘం మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలను పురస్కరించుకొని పారిశుధ్య కార్మికులకు కొత్త బట్టలను పంపిణీ చేశారు. పట్టణంలోని ఆమె నివాసం వద్ద ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి మున్సిపల్ పారిశుధ్య కార్మికులందరికీ పండుగ కానుకగా దుస్తులను అందజేశారు.

మంత్రి, ఎమ్‌పి, ఎమ్మెల్యేలను సత్కరిస్తున్న టిడిపి నాయకులు

మంత్రి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు చెబుతున్న జిల్లా కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి

మరో నూతన అధ్యాయానికి శ్రీకారం : ఎమ్‌పి

ప్రజాశక్తి- విజయనగరంకోట

ఉత్తరాంధ్ర ప్రజలు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నరోజు రానే వచ్చిందని ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఈనెల 4న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి తొలిసారి ఢిల్లీ నుంచి పౌర విమానయానశాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ట్రైలర్ విమానంలో భోగాపురం రానున్నారని తెలిపారు. గురువారం సాయంత్రం అశోక్‌బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన సంవత్సరంలో ప్రజలందరికీ సుఖ సంతోషాలు కలగాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, టిడిపి నాయకులు బొద్దల నర్సింగరావు, గంటారవి, మహంతి చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు స్థలం సిద్ధం

- మంజూరే ఆలస్యం..!
- అద్దె ఇంట్లోనే చదువులు
- ఆందోళనలో విద్యార్థులు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని పెద్ద పంచాయతీలలో ఆ పంచాయతీ ఒకటి. అన్ని పంచాయతీ కేంద్రాలలో పక్కా భవనాలతో పాఠశాలలు ఉన్నప్పటికీ, అక్కడ మాత్రం అద్దె ఇంటిలోనే చదువులు పిల్లలకు చెప్పాల్సిన దుస్థితి. ఏ ఆధారమూ లేనప్పుడు తాటి కమ్మె పెద్ద గొడుగు అన్న రీతిగా ఆ ఇల్లు పాఠశాలకు దిక్కుగా తయారైంది. ఇది దబ్బగడ్డలో చదువు కునే పిల్లల పరిస్థితి. కొన్నేళ్ల క్రితం ఈ పంచాయతీ కేంద్రంలో ఆర్‌సిఎం పాఠశాల ఉండేది.

పాఠశాల కోసం తదును చేసిన స్థలం

ఎయిడెడ్ పాఠశాల కనుమరుగు కావడం, అక్కడ పాఠశాల లేకపోవడంతో విద్యార్థులు పక్క గ్రామం కోన వెళ్లి చదువుకోవలసి వచ్చేది. ఈ సమస్యను గుర్తించిన స్థానిక జెడ్‌పిటిసి ఎం.శ్రీనివాస రావు పంచాయతీ తీర్మానంతో పాటు మండల పరిషత్ తీర్మానం కూడా చేసి మరల ప్రాథమిక పాఠశాల మంజూరు చేశారు. ప్రస్తుతం పాఠశాలలో సుమారు 20 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే అద్దె భవనం అదీ పురాతన పెంకుటిల్లు కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. 2023లో ఇక్కడ పాఠశాలకు పక్కా భవనం మంజూరు చేయాలని జిల్లా అధికారులకు కూడా నివేదికలు అందజేశారు. కానీ ఇంతవరకు పాఠశాలకు పక్కా భవనం మంజూరు కాలేదు. గ్రామంలో యువత అంతా కలిసి పాఠశాల కోసం కేటాయించిన స్థలాన్ని చదును చేయించారు. అంతేకాకుండా సంబంధిత స్థలానికి హద్దులు కూడా ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలకు పక్కా భవనం మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు

పెంకుటింట్లో నడుపుతున్న పాఠశాల

ప్రజలంతా ఐక్యంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రజలంతా కలిసిమెలిసి ఉంటూ గ్రామాన్ని అభివృద్ధి చేసుకొని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకోవాలని ఎంఇఒ-1, ఆర్తాం గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి జామి నారాయణ స్వామి అన్నారు. గురువారం ఆర్తాంలో నూతన సంవత్సర వేడుకల్లో ఆయన పాల్గొని కేక్ కట్ చేసి గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులంతా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. ప్రజలు తమ ఇంటి పరిసర ప్రాంతాలతో పాటు గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 తిరుపతిరావు, సర్పంచ్ జి.శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ కె.శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

గోరింటలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని గోరింటలో అవినాష్ సావే ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'సేవ్ వైజాగ్ స్టీల్' నినాదంతో చైర్మన్ కూన వెంకటరావు ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి మూడుస్థానాల్లో నిలిచిన మహిళలకు బహుమతులతో పాటు, పోటీల్లో పాల్గొన్న మహిళ లందరికీ కన్సోలేషన్ బహుమతులను సంక్రాంతి రోజున అందజేయడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో న్యాయనిర్ణేతలుగా గ్రామానికి చెందిన చింతాడ మంగమ్మ, బాడాన మౌనిక, కూన శ్రీలేఖలు వ్యవహరించారు. పోటీలకు సహకరించిన కూన కార్తీక్, వప్పల శ్రీనివాస్, గ్రామ యువకులకు కృతజ్ఞతలు తెలిపారు.

25న జిల్లాస్థాయి హిందీ ప్రతిభా పరీక్ష

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

6 నుంచి 10వ తరగతుల విద్యార్థులకు జిల్లాస్థాయి హిందీ ప్రతిభా పరీక్షను జనవరి 25న జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో నిర్వహించనున్నట్లు హిందీ మంచ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంపివలస రామారావు, ఉత్తరాంధ్ర కార్యదర్శి కోనే శ్రీధర్ ప్రకటనలో తెలిపారు. హిందీ సేవా సదన్ (అనంతపురం) ఆధ్వర్యంలో గత నెలలో రాష్ట్ర వ్యాప్తంగా 6 నుంచి 10వ తరగతుల విద్యార్థులకు నిర్వహించిన పాఠశాల స్థాయి హిందీ టాలెంట్ టెస్ట్‌లో జిల్లాస్థాయి పరీక్షకు ఎంపికైన పాఠశాల స్థాయి టాపర్స్ వివరాలను విశ్రాంత డిఇఒ బలివాడ మల్లేశ్వరరావు జిల్లా కేంద్రంలో విడుదల చేశారని తెలిపారు. హిందీ మంచ్ సంస్థ సమన్వయంతో ఉత్తరాంధ్రలో 2,300 మందికిపైగా విద్యార్థులు పాఠశాల స్థాయి ప్రతిభా పోటీలో పాల్గొన్నారని, వీరిలో 150 మంది పాఠశాల స్థాయిలో ప్రతిభావంతులుగా నిలిచి జిల్లా స్థాయి పరీక్షకు ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 25న శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నామని పేర్కొన్నారు. సంచాం యుపి స్కూల్, రణస్థలం హైస్కూల్, అక్కులపేట హైస్కూల్‌కు చెందిన హిందీ పండిట్‌లు రొంపివలస రామారావు, బి.మంజుల, కనుగుల సత్యం జిల్లాస్థాయి పోటీకు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారని తెలిపారు. పాఠశాల స్థాయి ప్రతిభావంతులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేయనున్నట్లు, జిల్లాస్థాయి పోటీలో టాపర్స్‌గా నిలిచే విజేతలకు ప్రత్యేక సమావేశంలో మెడల్స్ బహూకరించి సత్కరించనున్నట్లు వివరించారు. జిల్లాస్థాయి పోటీ పరీక్షకు ఎంపికైన విద్యార్థులను విశ్రాంత డిఇఒ బలివాడ మల్లేశ్వరరావు, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పోలుమహంతి జగన్మోహనరావు, విశ్రాంత సెట్‌శ్రీ సిఇఒ సురంగి మోహనరావు అభినందించారు.

కేలెండర్లు ఆవిష్కరణ

కవిటి: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఎపిటిఎఫ్, ఆపస్, అపోటా చేస్తున్న సేవలు చిరస్మరణీయమని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఎపిటిఎఫ్, ఆపస్, అపోటా 2026 సంవత్సరం క్యాలెండర్లు గురువారం ఆవిష్కరించారు. ఈ నూతన సంవత్సరంలో విద్యారంగం మరింత అభివృద్ధి చెందాలన్నారు. అందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఎంఇఒలు ధనుంజయ మజ్జి, సనపల రామకృష్ణ ఆవిష్కరించి ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆయాశాఖల సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: ఎపిటిఎఫ్ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గురువారం ఎంఇఒలు ఎస్.దేవేంద్ర రావు, పద్మనాభరావులు గురువారం ఆవిష్కరించారు. జిల్లా ఉపాధ్యక్షులు డిల్లీశ్వరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అప్పలరాజు, రామారావు, అనిల్ కుమార్, వెంకటరావు, చిన్నారావు, శ్రీనివాస్, ధర్మారావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పట్టణంలో అపోటా పాకెట్ క్యాలెండర్‌ను ఉత్తరాంధ్ర జిల్లాల ఒడియా లింగ్విస్టిక్ మైనార్టీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ పాడి, ఉత్తరాంధ్ర ఒడియా డి.ఐ.దుర్గాప్రసాద్ చౌదరి, అపోటా రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్‌పాడి, ప్రధాన కార్యదర్శి బృందావన్ దోళాయి, అపోటా మాజీ అధ్యక్షుడు రఘునాథ గౌడలు నూతన సంవత్సరం కేలండర్‌ను ఆవిష్కరించారు.

ప్రజాశక్తి
శుక్రవారం 2 జనవరి 2026

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి -పార్వతీపురం

2026 నూతన సంవత్సర వేడుకలు జిల్లాలో గురువారం ఘనంగా జరిగాయి. ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఆయా కార్యాలయాల సిబ్బంది, నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డికి జిల్లా ఉన్నతాధికారులు పెద్దఎత్తున తరలివచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డిఆర్‌ఒ హేమలత సమక్షంలో కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో జెసి, డిఆర్‌ఒతో పాటు పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు ఆర్. వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, కెఆర్‌సి ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, ట్రైబల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వినోద్, డిపిఆర్‌ఒ కె.బాల మాన్‌సింగ్, డ్వామా, డిఆర్‌డిఎ, ఐసిడిఎస్ పీడీలు కె.రామచంద్రరావు, ఎం.సుధారాణి, టి.కనకదుర్గ, సిపిఒ ఎస్‌ఎస్‌ఆర్. పట్నాయక్, వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్య శాఖల అధికారులు ఆర్.అన్నపూర్ణ, డాక్టర్ ఎస్.మన్మథరావు, సంతోష్, పిఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులు వివి నగేష్‌బాబు, ఆర్. అప్పలనాయుడు, జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారులు ఎస్.భాస్కరరావు, విజయపార్వతి, ఎం.వినోద్‌కుమార్, టి.జగన్ మోహన్, డిఇఒ బ్రహ్మాజీరావు, డిపిఒ కొండలరావు, పలువురు తహశీల్దార్లు, ఎంపిడిఒ, ఇతర శాఖల జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వెల్లువెత్తిన శుభాకాంక్షలు

గుమ్మలక్ష్మీపురం : కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి క్యాంపు కార్యాలయ ఆవరణలో నూతన సంవత్సర వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు, పుస్తకాలు, పెన్నులు అందజేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చిన ప్రతి ఒక్కర్నీ ఎమ్మెల్యే ఆత్మీయంగా పలకరిస్తూ, నూతన సంవత్సరంలో నియోజకవర్గ అభివృద్ధికి మరింత అంకితభావంతో పని చేస్తామని భరోసా ఇచ్చారు. అలాగే కురుపాం యూనిట్ ఎపి ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ఎస్ ప్రకాష్, నాయకులు జె.తిరుపతిరావు, జి.నారాయణరావు, ఆకుల మురళీకృష్ణ, గుంట్రెడ్డి సురేష్ కుమార్, సంతోష్ కుమార్ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

పార్వతీపురం టౌన్ : నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర నివాసం వద్ద టిడిపి పట్టణ కార్యదర్శి మజ్జి వెంకటేష్, సీనియర్ నాయకులు మజ్జి కృష్ణమోహన్, మజ్జి రాజా బ్రదర్స్ ఏర్పాటుచేసిన భారీ కేక్ ను ఎమ్మెల్యే చేతుల మీదుగా కట్ చేశారు. ఎమ్మెల్యేకు నియోజకవర్గంలో గల పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాలు, పార్వతీపురం పట్టణ ప్రజలు, టిడిపి అభిమానులు, కార్యకర్తలతో పాటు, నియోజకవర్గంలో ఉన్న పోలీస్, ఎక్సైజ్, విద్య, వైద్యం, మహిళ శిశు సంక్షేమం, వ్యవసాయ, ఇరిగేషన్, మున్సిపల్, ఆర్ అండ్ బి, అర్‌టిఒ, ఆర్‌టిసి, అటవీ, మత్స్య, జి సిసి, ఐటిడిఎ, భూగర్భగనులు, తదితర శాఖల అధికారులు, అధిక సంఖ్యలో వచ్చి పుష్పగుచ్ఛాలను, పూల మొక్కలను, పండ్లను, అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జెసి, డిఆర్‌ఒ

వీరఘట్టం : పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు తన స్వగ్రామమైన ఎం.రాజపురంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు నియోజకవర్గ పరిధిలో గల భామిని, సీతంపేట, పాలకొండ, వీరఘట్టం మండలాల నుండి అధికారులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి స్వగ్రామైన వండువలో ఆయా మండలాల నుంచి వైసిపి కార్యకర్తలు, అభిమానులు గ్రామానికి చేరుకుని నూతన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎంపిపి డి వెంకటరమణ నాయుడు, జడ్పిటిసి జంపు కన్నతల్లి-ఉమామహేశ్వరరావుకు కూడా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే జగదీశ్వరికి శుభాకాంక్షలు తెలుపుతున్నమహిళా ఉద్యోగులు

కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

జయకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

నేటి నుంచి నాలుగో విడత భూ రీసర్వే

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో నాలుగో విడత భూ రీసర్వే ఈనెల 2 (శుక్రవారం) నుంచి ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి అన్నారు. 121 గ్రామాల్లో నాలుగో విడత రీసర్వేలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం, రీ సర్వే కార్యక్రమం 6 నెలల్లో పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రీసర్వే ద్వారా భూసమస్యల పరిష్కారం, భూములపై స్పష్టమైన హక్కులు, ఆధునిక మ్యాప్‌ల రూపకల్పన వంటి ప్రయోజనాల ద్వారా ప్రజలకు మేలు చేకూరుతుందని కలెక్టర్ తెలిపారు. రైతులు, భూస్వాములు తమ భూములకు సంబంధించిన డాక్యుమెంట్లు, పట్టాలు, ఇతర అవసరమైన పత్రాలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. సర్వే సమయంలో తాము గానీ, వారి కుటుంబ సభ్యులు గాని తప్పనిసరిగా హాజరై సర్వే, రెవెన్యూ సిబ్బందికి సహకరించాలని కలెక్టర్ కోరారు. రీ సర్వే కార్యక్రమం వల్ల భవిష్యత్తులో భూమి సంబంధిత వివాదాలు గణనీయంగా తగ్గుతాయని కలెక్టర్ తెలిపారు.

శ్రమదానంతో రోడ్డును బాగు చేసుకుంటున్న గిరిజనులు

శ్రమదానంతో రోడ్డు బాగు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని తాడికొండ పంచాయతీ పరిధిలో గల అడ్డంగిభద్ర, కప్పకల్లు, శిఖరపాయి గిరిశిఖర గ్రామాలకు రోడ్డు సదుపాయం లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. మౌలిక సౌకర్యాలు లేక విద్య, వైద్యానికి దూరంగా ఉంటున్నారు. గిరిజన ఉత్పత్తులను విక్రయించడానికి అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వస్తుంది. దీంతో తమ గ్రామానికి రాకపోకలు సాగించేందుకు అంతా ఏకమై శ్రమదానం చేస్తూ రోడ్డును బాగు చేసుకుంటున్నారు. ఇకనైనా అధికారులు, పాలకులు స్పందించి తమ గ్రామాలకు శాశ్వత రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

బాధ్యతతో కలిసి పనిచేద్దాం : కమిషనర్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణాభివృద్ధికి అంతా కలిసి బాధ్యతతో పనిచేద్దామని స్థానిక మున్సిపల్ కమిషనర్ కొత్తగా బాధ్యతలు చేపట్టిన ధోనింపూడి పావని అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌గా ఆమె బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆమెను, బదిలీపై వెళ్తున్న కమిషనర్ కె.కిషోర్ కుమార్‌తో పాటు కార్యాలయంలో పలు విభాగాల అధికారులు, 15 సచివాలయాల సెక్రెటరీలు, కార్యాలయం సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందించి అభినందనలు తెలిపారు. తమకు తాము పరిచయం చేసుకున్నారు. అనంతరం కొత్త కమిషనర్ పావని మాట్లాడుతూ తాను అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చానని తెలియజేశారు. స్థానిక ఎమ్మెల్యే విజయచంద్ర, మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, పాలకవర్గ కౌన్సిల్ సభ్యుల సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అంతా కలిసి పనిచేద్దామని అన్నారు.

ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన కమిషనర్

కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర స్వగృహానికి వెళ్లి ఆమె మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి పరిచయం చేసుకున్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరిని, వైస్ చైర్‌పర్సన్లు కొండపల్లి రుక్మిణి, ఇండుపూరు గున్నేశ్వరరావును కూడా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు కమిషనర్‌తో మాట్లాడుతూ పార్వతీపురం మున్సిపాలిటీని అభివృద్ధి చేసే దిశగా పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు.

ఎమ్మెల్యేకు పూలమొక్కను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం ఎస్ఐగా హేమలత

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా హేమలత గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎం.రాజేష్ పార్వతీపురం రూరల్ బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సిబ్బంది సహకారంతో ముందుకెళ్తానని ఆమె అన్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు ఆమె తెలిపారు.

వీరఘట్టం ఎస్ఐగా షణ్ముఖరావు బాధ్యతలు స్వీకరణ

వీరఘట్టం : స్థానిక ఎస్సైగా ఎస్.షణ్ముఖరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పార్వతీపురంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన జి.కళాధర్ బదిలీపై పార్వతీపురం వెళ్లారు. ఈ సందర్భంగా షణ్ముఖరావు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అంతా సహకరించాలని కోరారు.

కేలండర్, డైరీని ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ డైరీ, కేలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - సీతానగరం

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని యుటిఎఫ్ ప్రచురించిన డైరీ, కేలెండర్‌ను సీతానగరం మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక విద్యావనరుల కేంద్రం వద్ద గురువారం ఆవిష్కరించారు. మండల ఎంఇఒ ఎం.వెంకటరమణ డైరీ, కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండలశాఖ గౌరవాధ్యక్షులు టి.మధుసూదనరావు, అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు ఎం.గోవిందరావు, బి. ప్రసాదరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పి.శ్రీనివాసరావు, కె.ఉమామహేశ్వరరావు, సహాధ్యక్షులు బి.ఆదినారాయణ, మహిళా సహాధ్యక్షులు కె.లక్ష్మి ట్రెజరర్ డివి రమణ, మండల కౌన్సిల్ సభ్యులు కె.మురళి, ఎ.శంకరరావు, జి.పోలి నాయుడు, బి.ప్రసాద్, వి.తవిటినాయుడు, ఆర్.శంకరరావు, ఎన్.త్రినాథ్, కె.కృష్ణదాస్ పాల్గొన్నారు.

డంపర్‌బిన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పారిశుధ్యానికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక మున్సిపాల్టీలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే బి.విజయచంద్ర తెలిపారు. మున్సిపాల్టీకి సమకూర్చిన డంపర్ బిన్ (చెత్త తొట్టెలు)లను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిసరాల శుభ్రతతో చక్కటి ఆరోగ్యం సొంతమవుతుందని, దీన్ని గుర్తించి ప్రభుత్వం అనేక స్వచ్ఛత కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యతన్నారు. చెత్తను ఆరు బయట పారేయకుండా చెత్త తొట్టిలో వేస్తే పురపాలక సిబ్బంది వచ్చి దాన్ని డంపింగ్ యార్డుకు తరలిస్తారని, అప్పుడు పరిసరాలు బాగుంటాయని ఎమ్మెల్యే అన్నారు. పురపాలక సంఘంలో చెత్త సేకరణ కూడా మరింత సమర్ధవంతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ పావని, పురపాలక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గోపీనాథ్ జెట్టికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మన్యం ఎస్‌పి మాధవరెడ్డి

గోపీనాథ్‌జెట్టికి ఐజిగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విశాఖపట్నం రేంజ్ డిఐజిగా విధులు నిర్వహిస్తున్న గోపినాథ్ జట్టికి ఐజిగా ఉద్యోగోన్నతి లభించింది. విశాఖ రేంజ్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన పోలీసు అధికారులతో కలిసి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు విజయనగరం ఎస్‌పి ఎఆర్ దామోదర్, మన్యం జిల్లా ఎస్‌పి మాధవరెడ్డి, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల ఎస్‌పిలు అభినందనలు తెలిపారు. అనంతరం ఐజి గోపినాథ్‌జెట్టి పోలీసు కార్యాలయంలో కేక్ కట్ చేసి సిబ్బంది మధ్య నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. కార్యాలయ మినిస్టీరియల్ సిబ్బంది, క్యాంపు కార్యాలయ సిబ్బంది మరియు ఇతర శాఖల ప్రతినిధులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రేంజ్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేర నియంత్రణకు పెద్దపీట వేస్తామని, పోలీసు యంత్రాంగం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

ఐజికి ఎస్‌పి శుభాకాంక్షలు

పార్వతీపురం టౌన్ : విశాఖ రేంజ్ డిఐజిగా విధులు నిర్వహిస్తున్న గోపినాథ్ జట్టి ఉద్యోగోన్నతిపై గురువారం ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజిపి)గా బాధ్యతలు స్వీకరించారు. ఐజిగా బాధ్యతలు చేపట్టిన గోపినాథ్ జట్టిని రేంజ్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి నూతన సంవత్సర, ఉద్యోగోన్నతి శుభాకాంక్షలు తెలిపారు.

డైరీని ఆవిష్కర్తున్న కలెక్టర్, అసోసియేషన్ నాయకులు

రెవెన్యూ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ 2026 నూతన సంవత్సర డైరీ, కేలెండర్‌ను జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ డైరీలో రెవెన్యూ విభాగానికి సంబంధించిన కీలకమైన చట్టాలు, సర్క్యులర్లు మరియు మెమోలను పొందుపరచడం ద్వారా ఉద్యోగులకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అవసరమైన సమాచారం ఒకే చోట లభించడం వల్ల పనిలో వేగం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ సంఘం అధ్యక్షులు టి.గోవింద, కార్యదర్శి సూర్యతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి మురళి, ఎఒ దేవ్ ప్రసాద్, ఇతర రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం రెవెన్యూ సిబ్బంది అందరూ జిల్లా కలెక్టర్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సిఐటియు బహిరంగ సభకు తరలిరండి

ప్రజాశక్తి - పాలకొండ

విశాఖపట్నంలో జరుగు సిఐటియు అఖిల భారత మహాసభలు సందర్భంగా ఈనెల 4న జరుగు బహిరంగ సభకు తరలి రావాలని వివిధ రంగాల కార్మికులకు సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణంలో ఎపిఎస్‌ఆర్టీసీ హైర్ బస్సు డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా సిఐటియు అఖిలభారత మహాసభలు విశాఖపట్నంలో జరుగుతున్నాయని, ఈ మహాసభలు జయప్రదానికి అంతా సహకరించాలని కోరారు. కార్మిక వర్గ హక్కులు పరిరక్షణ, భవిష్యత్తు పోరాటాలను రూపొందించేందుకు ఈ మహాసభలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల, ఉద్యోగుల హక్కుల హరించేందుకు పూనుకొన్న నేపథ్యంలో ఈ మహాసభలకు అత్యంత ప్రాధాన్యత ఉన్నదని ఈ మహాసభలలో పాల్గొని జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. అలాగే స్థానిక ఎపిఎస్ ఆర్‌టిసి డిపో పరిధిలో గల హైర్ బస్సు డ్రైవర్లకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాల అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపిఎస్‌ఆర్టీసీ పాలకొండ డిపో హైర్ బస్సు యూనియన్ నాయకులు కె.శ్రీనివాస్, జి.మన్మధరావు, ఇ.శివాజీ, ఎస్.గణేష్, జి.సురేష్, ఎం.నరేష్, వై.ధనంజయరావు, కెజిఆర్, ఆర్.కుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టంలో ప్రచారం చేస్తున్నసిఐటియు నాయకులు ఇందిర, నాగమణి తదితరులు

పాలకొండలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

వీరఘట్టం : సిఐటియు జాతీయ మహాసభల్లో భాగంగా ఈనెల 4న జరుగు బహిరంగసభకు అధిక సంఖ్యలో కార్మికులు, అసంఘటిత కార్మికులు హాజరు కావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం వీరఘట్టంలో సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఆర్థిక విధానాల వల్ల కార్మిక వర్గం తీవ్ర ఇబ్బందులకు గురవుతుందని, కార్మిక హక్కులను హరించేలా లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టి కార్మిక వర్గంపై తీవ్ర భారం మోపిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరచడం ద్వారా సామాన్యులకు ఉపాధి లేకుండా చేస్తున్నారని, రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ కూడా లేకుండా చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను కట్టబెట్టేందుకు ప్రభుత్వంగానే బలహీనపరుస్తుందని, ఈ విధానాలకు వ్యతిరేకంగా నికరమైన పోరాటాలు నిర్వహించేది సిఐటియు ఒక్కటేనన్నారు. ఈ మహాసభల జయప్రదానికి కార్మిక వర్గం ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిహెచ్ నాగమణి, ఆశ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

గిరిజనుల మధ్య కలెక్టర్, జెసి నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - కొమరాడ

నూతన సంవత్సరం వేడుకలు గిరిజన ప్రజలతో కలిసి జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండలంలోని గదబవలసలో నిర్వహించిన నూతన సంవత్సర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోకి వచ్చిన కలెక్టర్, జెసిలను స్థానిక గిరిజనులు ఘనంగా స్వాగతం పలికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన సంవత్సర దినోత్సవం వేడుకల్లో భాగంగా గిరిజనులు నృత్యాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి కలెక్టర్, జెసి మన్నలను పొందారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ గ్రామంలోని సమస్యలను ప్రజలతో ముచ్చటించి తెలుసుకున్నారు. గ్రామంలో ఇటీవల జరిగిన రీసర్వేలో తప్పిదాల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. వృద్ధులకు పండ్లు, స్వీట్లు అందజేసి ప్రత్యేక నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి వారితో సరదాగా సాయంత్రం వరకు గడిపారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి, మళ్లీ మీ గ్రామానికి వచ్చి ప్రజలతో ముచ్చటిస్తానని కలెక్టర్ గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. మన్యం జిల్లా కలెక్టర్ అయి ఉండి ఒక సామాన్య పౌరుడిగా వచ్చి తమతో నూతన సంవత్సర వేడుకలు జరుపుకునేందుకు ఎంతో ఆనందంగా ఉందని ఆ గ్రామ గిరిజనులు సంతోష వ్యక్తం చేశారు. ఇంతవరకు ఏ అధికారి కూడా తమ గ్రామానికి వచ్చి ఇలా వేడుకలు జరుపుకునే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఎంపిడిఒ ఎస్.రమేష్, ఎంఇఒలు జామి నారాయణస్వామి, తిరుపతిరావు, వైస్ సర్పంచ్ కె.శంకర్రావు, డిప్యూటీ ఎంపిడిఒ రాధాకృష్ణ, పలువురు అధికారులు, ఉద్యోగులు, స్థానిక నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

గదబవలసలో కలెక్టర్‌కు కేక్ తినిపిస్తున్న గిరిజన మహిళలు

రహదారి నిబంధనలను విధిగా పాటించాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

రహదారిపై ప్రయాణించేటప్పుడు ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి కోరారు. గురువారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను ప్రారంభించి, గోడ పత్రికలను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రహదారిపై జాగ్రత్తగా వాహనాన్ని నడపడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చుని, జరుగుతున్న ప్రమాదాలలో 90 శాతం నిబంధనలు పాటించకపోవడం వల్లే జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు తమ కుటుంబాలను, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు జనవరి 1 నుంచి 31వరకు జరుగుతాయని, ఈ నెల రోజుల పాటు రహదారి భద్రతా నియమాలు మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ వర్గాల ప్రజలకు, వాహన చోదకులకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఉప రవాణా కమిషనర్ డి. మణి కుమార్, మోటారు వాహన తనిఖీ అధికారులు మురళీకృష్ణ, దుర్గాప్రసాద్, శశి కుమార్, రవి శంకర్ ప్రసాద్, వెంకట రావు, శివ రామగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి, రవాణాశాఖ అధికారులు